CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 9 సంచిక : 45 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 22 అక్టోబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :9 ISSUE : 45 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | WED 22 OCTOBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది

- శాంతిభద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ
- గూగుల్ రాకకు అదే కారణమన్న సీఎం చంద్రబాబు
- రాజకీయ ముసుగులో పెరిగిపోతున్న నేరాలు, విద్వేషాలు
- పోలీసుల కుటుంబ సంక్షేమం ప్రభుత్వ బాధ్యత
- సోషల్ మీడియా నేరాలు పోలీసులకు పెను సవాలు
- మంగళగిరిలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నాయన్న నమ్మకంతోనే గూగుల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబ డులకు రక్షణ ఉంటేనే పారిశ్రామికవేత్తలు వస్తారని, తద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ మైదానంలో మంగళవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు.

**గూగుల్ రాకకు అదే కారణం**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి పూర్తి భద్రత ఉంటుందన్న భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి అన్నారు. "శాంతిభద్రతలు అనే పునాదిపైనే అభివృద్ధి, సంక్షేమం ఆధారపడి ఉంటాయి. సమాజంలో అశాంతి, అలజడి ఉంటే ఏ ఒక్క పరిశ్రమా రాష్ట్రం వైపు చూడదు. అందుకే శాంతిభద్రతల విషయంలో నేను ఎప్పుడూ కఠినంగా ఉంటాను. ఆ నమ్మకంతోనే విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేస్తోంది. ఇది దేశంలోనే అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటి. ఇలాంటివి మరిన్ని రావాలంటే పోలీస్ వ్యవస్థ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి" అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణిచివేయడంలో ఏపీ పోలీసులది ప్రత్యేక గుర్తింపు అని ప్రశంసించారు.

**పోలీసులది ఉద్యోగం కాదు.. నిస్వార్థ సేవ**

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. "1959 అక్టోబర్ 21న లధఖ్‌లో చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి 10 మంది జవాన్లు ప్రాణత్యాగం చేశారు. వారి స్ఫూర్తితోనే ఏటా ఈ రోజును పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా జరుపుకుంటున్నాం. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 192 మంది

వివరాలు 2లో..

## భీమవరం డీఎస్పీపై పవన్ కల్యాణ్ సీరియస్..?
### నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం



- భీమవరం డీఎస్పీ జయసూర్యపై పవన్‌కు ఫిర్యాదులు
- పేకాట శిబిరాలు, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు
- పశ్చిమ గోదావరి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన పవన్ కల్యాణ్

పెన్ పవర్ డెస్క్:పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారశైలిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. డీఎస్పీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని

వివరాలు 2లో..

## ఏపీకి గూగుల్ రాకపై తమిళనాట రాజకీయ రగడ...
### ఒక్క మాటతో తేల్చేసిన నారా లోకేశ్



- విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్
- తమిళనాడు డీఎంకేపై అన్నాడీఎంకే విమర్శలు
- డీఎంకే ప్రభుత్వ వైఫల్యం వల్లే పెట్టుబడి ఏపీకి వెళ్లిందన్న అన్నాడీఎంకే
- గూగుల్ సీఈవో తమిళ వ్యక్తి అయినా పెట్టుబడి తేలేకపోయారని విమర్శ
- ఈ రాజకీయ వివాదంపై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేశ్‌ఓ

పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వ్యవహారం పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ దుమారం రేపుతోంది. ఈ పరిణామంపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఆసక్తికరంగా స్పందించారు. తమిళనాడులోని అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే మధ్య జరుగుతున్న మాటల యుద్ధానికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను ఆయన పంచుకున్నారు.విశాఖకు గూగుల్ రూపంలో

వివరాలు 2లో..

## 6 వేల పోలీసు ఉద్యోగాలకు త్వరలో పోస్టింగ్‌లు



- పోలీసు నియామకాలపై మంత్రి అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు
- 6 వేల ఉద్యోగాలకు త్వరలోనే పోస్టింగ్స్ ఇస్తామని వెల్లడి
- గత ఐదేళ్లలో ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదని విమర్శ
- రాష్ట్రంలో పోలీస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్న మంత్రి
- సమస్యలున్నా ఉద్యోగులందరికీ డీఏ ఇచ్చామని వ్యాఖ్య

వివరాలు 2లో..

## నేటి నుంచి యూఏఈలో సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట...

- నేటి నుంచి మూడు రోజుల పాటు సీఎం చంద్రబాబు యూఏఈ పర్యటన
- రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం
- విశాఖ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- పలు అంతర్జాతీయ సంస్థల అధినేతలతో చంద్రబాబు భేటీ
- సీఐఐ రోడ్ షో, ప్రవాసాంధ్రుల సమావేశంలో పాల్గొననున్న సీఎం
- సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారుల బృందం పర్యటన

వివరాలు 2లో..



## ప్రొద్దుటూరును క్యాసినో అడ్డాగా మార్చారు
## రాచమల్లు సంచలన ఆరోపణలు

- ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయన్న రాచమల్లు
- క్యాసినో, మట్కా, బెట్టింగ్ విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆరోపణ
- టీడీపీ నేతలే ఈ దందాలు నడుపుతున్నారన్న రాచమల్లు

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం అసాంఘిక కార్యకలాపాలకు కేం ద్రంగా మారిందని, అధికార టీడీపీ నాయ కులే ఈ వ్యవహారాలను నడిపిస్తున్నారని వైసీపీ



## రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సిందూర్'..
### దీపావళి లేఖలో ప్రధాని మోదీ

- దేశ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ లేఖ
- రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సిందూర్' చేపట్టామన్న ప్రధాని
- జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు వేల కోట్ల ఆదా అని వెల్లడి
- స్వదేశీ వస్తువులనే వాడాలంటూ ప్రజలకు పిలుపు
- త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందన్న మోదీ

వివరాలు 2లో..



## పోలీసుల వల్లే ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు



- పోలీసు అమరవీరుల దినోత్సవంలో పాల్గొన్న అనిత
- పోలీసు శాఖలో 6,100 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టామని వెల్లడి
- మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:పోలీసు శాఖను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టామని ఆమె స్పష్టం చేశారు. ఈరోజు మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో నిర్వహించిన 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే అందుకు పోలీసుల త్యాగాలే కారణమని కొనియాడారు.

వివరాలు 2లో..

## తాడిపత్రి ఏఎస్పీపై జేసీ ఫైర్.. యూపీకి తిప్పి పంపిస్తానంటూ తీవ్ర వ్యాఖ్యలు

- తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్‌పై టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఏఎస్పీకి చదువు తప్ప బుద్ధి, జ్ఞానం లేవని వివాదాస్పద వ్యాఖ్య
- ఘర్షణలు జరిగితే ఏఎస్పీ భయపడి పారిపోతారని ఎద్దేవా

పెన్ పవర్ డెస్క్:స్థానిక ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏఎస్పీకి చదువు మాత్రమే ఉందని, బుద్ధి, జ్ఞానం ఏమాత్రం లేవని సంచలన వ్యాఖ్యలు చేశారు. పదివేల మందితో సంతకాలు సేకరించి ఆయన్ను తిరిగి ఉత్తరప్రదేశ్‌కు పంపించేస్తామని హెచ్చరించారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారికి నివాళులర్పించిన అనంతరం జేసీ ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఏఎస్పీ రోహిత్ కుమార్ తీరుపై

వివరాలు 2లో..



## ఆస్ట్రేలియా పర్యటనలో నారా లోకేశ్ చొరవ...
### ఏపీ ఆక్వా రైతులకు భారీ ఊరట



- భారత రొయ్యల దిగుమతికి ఆమోదం తెలిపిన ఆస్ట్రేలియా
- ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ వెల్లడి
- వైట్ స్పాట్ వైరస్ కారణంగా ఉన్న అడ్డంకులు ఇక దూరం
- అమెరికా సుంకాలతో నష్టపోయిన ఆక్వా రంగానికి గొప్ప ఊరట
- కొత్త మార్కెట్ల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సఫలం
- సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియాతో భాగస్వామ్యంపై లోకేశ్ చర్చలు ఫలప్రదం

పెన్ పవర్ డెస్క్:అమెరికా విధించిన భారీ సుంకాలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు భారీ ఊరట లభించింది. భారత రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ కీలక నిర్ణయం తీసుకుంది. చాలాకాలంగా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# రెండు లక్షల మందికి ఉద్యోగాలు

విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఒక గిగావాట్ డేటా సెంటర్‌ను విశాఖలో గూగుల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఐదేళ్లలో లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. అయితే గూగుల్ కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముడసర్లోవ, తర్లువాడ, రాంభిల్లి మండలంలోని భూములను గూగుల్ కోసం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ ప్రతినిధులు ఆ ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సుమారుగా లక్షా 33 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో ఇటీవల ఏపీ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు గూగుల్ సంస్థ విశాఖలో వేయి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం విశాఖలో స్థల పరిశీలన జరుగుతోంది. గూగుల్ సంస్థ ప్రతినిధులు విశాఖలో పర్యటిస్తున్నారు. అనువైన ప్రాంతం కోసం అన్వేషిస్తున్నారు. గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం తర్లువాడ, ముడసర్లోవ ప్రాంతాలతో పాటుగా అనకాపల్లిలో జిల్లాలోని రాంబిల్లి మండలంలోని భూములను కూడా కేటాయించనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ కన్సల్టెంట్లు.. ఏపీ ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించారు. గూగుల్‌కు కేటాయించిన భూములలో సర్వే చేపట్టి అనంతరం హద్దులను నిర్దేశించనున్నారు.గూగుల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములలో తొలుత తర్లువాడ వద్ద పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముడసర్లోవ వద్ద గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం కేటాయించే భూములు.. సింహాచలం ఆలయానికి చెందినవి. దీంతో దేవస్థానంతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రాంబిల్లిలోని భూములు నౌకాదళం కేంద్రానికి సమీపంలో ఉన్నాయి. దీంతో నౌకాదళం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న మీదట.. తర్లువాడ వద్ద భూములు సిద్ధంగా ఉండటంతో అక్కడే తొలుత పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలీస్ భద్రతను కూడా పెంచారు. త్వరలోనే సర్వే చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫెన్సింగ్ నాటే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న గూగుల్ సంస్థ.. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. గూగుల్ పెట్టుబడుల ద్వారా విశాఖపట్నం ఏఐ హబ్‌గా మారుతుందని ప్రభుత్వం చెప్తోంది. మరోవైపు అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావటం విశేషం. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి 2028-32 మధ్య కాలంలో ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని అంచనా.అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. మరోవైపు డేటా సెంటర్ వలన ఎక్కువగా ఉద్యోగాలు రావని వైసీపీతో పాటు మరికొందరి వాదన. కేవలం డేటా స్టోరేజీ కోసం మాత్రమే ఉపయోగిస్తారని.. దీనితో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు రావటం కష్టమంటున్నారు. అయితే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులతో మరిన్ని కంపెనీలు విశాఖకు వచ్చే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం చెప్తోంది.

# పోలీసుల వల్లే ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు

- మొదటి పేజి తరువాయి

విధి నిర్వహణలో వారికి అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని, నేరాల నియంత్రణలో ఏపీ పోలీసులు దేశంలోనే ముందున్నారని ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుంటూ ముందుకు సాగుతున్నారని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనిత ఉద్ఘాటించారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా 'ఈగల్ టీం'ను ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించామని చెప్పారు. నిఘాను మరింత పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె వివరించారు.

# భీమవరం డీఎస్పీపై పవన్ కల్యాణ్ సీరియస్..?

## నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం

- మొదటి పేజి తరువాయి

జిల్లా ఎస్పీని ఆయన ఆదేశించారు.

భీమవరం డీఎస్పీ పరిధిలో పేకాట శిబిరాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, ఆయన నేరుగా సివిల్ వివాదాల్లో తలదూరుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి పలు ఫిర్యాదులు అందాయి. కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి నేతల పేర్లను వాడుకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పవన్ కల్యాణ్ నేరుగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు.తన దృష్టికి వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ, డీఎస్పీ జయసూర్య పనితీరుపై నివేదిక పంపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ స్థాయి అధికారి అసాంఘిక కార్యకలాపాలకు అండగా నిలవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు సివిల్ వివాదాల జోలికి వెళ్లకుండా చూడాలని, ఇలాంటి చర్యలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా చూస్తూ శాంతిభద్రతలను కాపాడాలని దిశానిర్దేశం చేశారు.అంతేకాకుండా, భీమవరం డీఎస్పీపై వచ్చిన ఆరోపణల విషయాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, డీజీపీ దృష్టికి కూడా తీసుకెళ్లాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

# తాడిపత్రి ఏఎస్పీపై జేసీ ఫైర్.. యూపీకి తిప్పి పంపిస్తానంటూ తీవ్ర వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆయన ఎప్పుడూ పోలీస్ డ్రెస్సులో కనిపించలేదు. ఆయనకు చదువు తప్ప బుద్ధి, జ్ఞానం, తెలివి లేవు. ఈ ఉద్యోగానికి ఆయన అనర్హుడు" అని జేసీ విమర్శించారు. తాను కార్యాలయం ముందు నిరసన తెలిపితే, ఏఎస్పీ బయటకు రాకుండా ఇంట్లోనే దాక్కున్నారని ఎద్దేవా చేశారు. తాడిపత్రిలో ఎక్కడైనా రాళ్ల దాడి జరిగితే ఈ ఏఎస్పీ భయపడి పారిపోతారని ఆరోపించారు.ఏఎస్పీ రోహిత్ కుమార్ తాడిపత్రికి వచ్చిన తర్వాత కూడా నేరాల సంఖ్య ఏమాత్రం తగ్గలేదని, టీడీపీ అధికారంలోకి వచ్చాకే క్రైమ్ రేట్ తగ్గిందని జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఎక్కడో ఉత్తరప్రదేశ్‌లో ఉన్న వ్యక్తిని ఇక్కడికి తీసుకొచ్చారంటూ ఆయన వ్యవహారశైలిపై అసహనం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్ వాళ్లకు బుద్ధి, జ్ఞానం ఉండవంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. కిందిస్థాయి సిబ్బంది అయిన కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలను చూసి ఏఎస్పీ చాలా విషయాలు నేర్చుకోవాలని జేసీ హితవు పలికారు. గత ఐదేళ్ల పాలనలో కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల వల్ల పోలీస్ వ్యవస్థ మొత్తం భ్రష్టు పట్టిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# 6 వేల పోలీసు ఉద్యోగాలకు త్వరలో పోస్టింగ్‌లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భర్తీ చేసిన 6 వేల పోలీసు ఉద్యోగాలకు త్వర లోనే పోస్టింగులు ఇవ్వనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. పోలీ సు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈరోజు నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన పాల్గొని, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసు నియామకాల ఆవశ్యకత ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు.గత ఐదేళ్ల పాలనలో పోలీసు శాఖలో నియామకాలు చేపట్టలేదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిందని, వీరికి త్వరలోనే నియామక పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో అనేక పోలీస్ స్టేషన్లు, క్వార్టర్ల పరిస్థితి బాగోలేదని మంత్రి అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. వాటి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని స్పష్టం చేశారు. పోలీసులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చారు. అనేక ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ డీఏ మంజూరు చేశామని గుర్తుచేశారు. అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడుతూ, వారి సేవలను స్మరించుకున్నారు.

# రాముడి స్ఫూర్తితోనే 'ఆపరేషన్ సిందూర్'..

దీపావళి పర్వదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక లేఖ విడుదల చేశారు. శ్రీరాముడు ధర్మాన్ని నిలబెట్టడం నేర్పినట్టే, అన్యాయంపై పోరాడే స్ఫూర్తిని కూడా ఇస్తారని ఆయన పేర్కొన్నారు. కొద్ది నెలల క్రితం జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఇందుకు ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని మోదీ వ్యాఖ్యానించారు.ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తన గౌరవాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా జరిగిన అన్యాయానికి ప్రతీకారం కూడా తీర్చుకుందని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం ప్రారంభమయ్యాక ఇది రెండో దీపావళి అని ప్రధాని గుర్తుచేశారు.ఈ దీపావళి చాలా ప్రత్యేకమైనదని ప్రధాని అభివర్ణించారు. దేశంలోని మారుమూల జిల్లాలతో సహా అనేక ప్రాంతాల్లో తొలిసారిగా దీపాలు వెలుగుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు నక్సలిజం, మావోయిస్టు ఉగ్రవాదంతో అట్టుడికిన ఈ ప్రాంతాలు ఇప్పుడు పూర్తిగా ప్రశాంతంగా మారాయని అన్నారు. హింసా మార్గాన్ని వీడిన ఎందరో మన రాజ్యాంగంపై విశ్వాసంతో అభివృద్ధి స్రవంతిలో కలుస్తున్నారని, ఇది దేశానికి గొప్ప విజయమని మోదీ పేర్కొన్నారు.ఇటీవల ప్రభుత్వం తీసుకున్న ఆర్థిక సంస్కరణలను కూడా మోదీ ప్రస్తావించారు. నవరాత్రుల తొలి రోజు నుంచే తగ్గిన జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయని, 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' ద్వారా ప్రజలు వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. పలు సంక్షోభాలతో ప్రపంచం అస్థిరంగా ఉన్నప్పటికీ, భారత్ స్థిరత్వానికి చిహ్నంగా నిలిచిందన్నారు. సమీప భవిష్యత్తులోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించాలని మోదీ పిలుపునిచ్చారు. స్వదేశీ ఉత్పత్తులను స్వీకరించి, 'ఇది స్వదేశీ!' అని గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని పెంపొందించాలని,

అన్ని భాషలను గౌరవించాలని, పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించుకుని, యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని హితవు పలికారు.ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినప్పుడు దాని కాంతి తగ్గదని, ఇంకా పెరుగుతుందని దీపావళి మనకు నేర్పుతుందని మోదీ అన్నారు. అదే స్ఫూర్తితో సమాజంలో సామరస్యం, సహకారం, సానుకూలత అనే దీపాలను వెలిగిద్దామని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ మరోసారి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# నేటి నుంచి యూఏఈలో సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట...

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించడమే అజెండాగా ఆయన బుధవారం నుంచి మూడు రోజుల పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చంద్రబాబుతో పాటు మంత్రులు, కీలక శాఖల ఉన్నతాధికారులతో కూడిన ఉన్నతస్థాయి బృందం కూడా పాల్గొంటుంది.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) వచ్చే నెల 14, 15 తేదీల్లో జరగనుంది. ఈ సదస్సుకు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించడం కూడా ఈ పర్యటనలో కీలక ఉద్దేశం. బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి చంద్రబాబు బృందం దుబాయ్‌కు బయల్దేరి వెళుతుంది. ఈ మూడు రోజుల్లో సీఎం పలువురు పారిశ్రామికవేత్తలు, యూఏఈ ప్రభుత్వ ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాల్లో పాల్గొంటారు. ఇప్పటికే ప్రభుత్వం సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో రోడ్ షోలు నిర్వహించి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే.

పర్యటనలో భాగంగా తొలిరోజైన అక్టోబర్ 22న చంద్రబాబు ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్, లూలూ గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ వంటి దిగ్గజ సంస్థల యాజమాన్యాలతో ఆయన చర్చలు జరుపుతారు. ముఖ్యంగా ఇండస్ట్రియల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పోర్టులు, షిప్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. దీనితో పాటు దుబాయ్‌లో సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) నిర్వహించే రోడ్ షోలో కూడా సీఎం పాల్గొంటారు.పర్యటన చివరి రోజున ఏపీఎన్ఆర్‌టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా (ప్రవాసాంధ్రులు) సమావేశంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఏపీ ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రి రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు.

# పెట్టుబడులకు రక్షణ ఉందన్న నమ్మకంతోనే గూగుల్ వచ్చింది

- మొదటి పేజి తరువాయి

పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెడుతున్న పోలీసులు చేసేది కేవలం ఉద్యోగం కాదు, అదొక నిస్వార్థ సేవ. వారి త్యాగాలను స్మరించుకుంటూ స్ఫూర్తి పొందాలి" అని అన్నారు.రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లు

సమాజంలో నేరాల స్వరూపం మారుతోందని, ముఖ్యంగా రాజకీయ ముసుగులో కొత్త తరహా నేరగాళ్లు పుట్టుకొస్తున్నారని చంద్రబాబు హెచ్చరించారు. "సమాజంలో అశాంతి సృష్టించి లబ్ధి పొందడమే లక్ష్యంగా కొందరు పనిచేస్తున్నారు. వీళ్లు సాధారణ నేరగాళ్ల కంటే ప్రమాదకరం. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్ మరణం, జీడీ నెల్లూరులో అంబేద్కర్ విగ్రహ దహనం వంటి ఘటనల్లో వాస్తవాలను దాచిపెట్టి, మత ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నించారు. సీసీ కెమెరాల వల్ల నిజాలు బయటపడ్డాయి. కల్తీ మద్యం విషయంలోనూ ఇలాగే దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు," అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా సాగే వ్యక్తిత్వ హననం, అసత్య ప్రచారాలు పోలీసులకు పెను సవాలుగా మారాయని పేర్కొన్నారు.

**టెక్నాలజీతో నేరాల కట్టడి**

మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖను సాంకేతికంగా బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. "నేరగాళ్లు అప్‌డేట్ అవుతుంటే, వారిని పట్టుకోవడానికి పోలీసులు మరింత అప్‌డేట్‌గా ఉండాలి. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 50 మీటర్లకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్నాం. ఇది పోలీసులకు మూడో కన్నులా పనిచేస్తుంది. డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్ వంటి టెక్నాలజీని వినియోగించి నేరాలను ఛేదిస్తున్నారు. అడవుల్లో గంజాయి తోటలను, ఎర్రచందనం స్మగ్లర్లను గుర్తించడానికి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో ఏపీ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది" అని అభినందించారు.

**పోలీసు కుటుంబాలకు ప్రభుత్వ అండ**

పోలీసుల సంక్షేమానికి, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "పోలీసుల గౌరవం పెంచడంతో పాటు వారి కుటుంబ సంక్షేమ

బాధ్యత మాది. పోలీసుల వైద్య సేవల కోసం 16 నెలల్లో రూ.33 కోట్లు విడుదల చేశాం. మరణించిన 171 మంది పోలీసులకు బీమా కింద రూ.23 కోట్లు అందించాం. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ మంజూరు చేయాలని నిర్ణయించాం. పోలీసులకు ఒక సరెండర్ లీవ్‌ను రెండు విడతల్లో చెల్లిస్తాం. 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తిచేశాం. శాఖాపరమైన పదోన్నతులు కూడా సకాలంలో అందిస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరును క్యాసినో అడ్డాగా మార్చారు

# రాచమల్లు సంచలన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టణంలో క్యాసినో, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి జూద క్రీడలు విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆయన విమర్శించారు.ఈ అక్రమ కార్యకలాపాలను టీడీపీకి చెందిన కీలక నాయకులే స్వయంగా నిర్వహిస్తున్నారని రాచమల్లు ఆరోపించారు. గోవాలో క్యాసినోలు నడిపే వారే ఇక్కడ కూడా ఈ దందాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో జూదం కోసం కడప నుంచి హైదరాబాద్ మీదుగా గోవాకు వెళ్లేందుకు ఇండిగో విమానంలో నిర్వాహకులు టికెట్లు కూడా బుక్ చేసుకున్నారని ఆయన సంచలన విషయాలు వెల్లడించారు. పట్టణంలో గంజాయి అమ్మకాలు పెరిగిపోయి యువత భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అక్రమాలతో పాటు, ప్రొద్దుటూరు కేంద్రంగా కొందరు టీడీపీ కౌన్సిలర్లు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని, నకిలీ మద్యం కూడా విరివిగా విక్రయిస్తున్నారని రాచమల్లు ఆరోపించారు. "పేద ప్రజల రక్తాన్ని టీడీపీ నేతలు పీల్చేస్తున్నారు. ఈ అక్రమాలన్నీ పోలీసులకు తెలిసినా ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం వహిస్తున్నారు" అని ఆయన అన్నారు.యువత భవిష్యత్తును నాశనం చేసే ఈ కార్యకలాపాలను తక్షణమే ఆపాలని టీడీపీ నాయకులను డిమాండ్ చేశారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ అయినా ఈ అక్రమాలపై దృష్టి సారించి, వాటిని అరికడతారని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ప్రొద్దుటూరులో శాంతిభద్రతలను కాపాడాలని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కోరారు.

# ఏపీకి గూగుల్ రాకపై తమిళనాట రాజకీయ రగడ...

- మొదటి పేజి తరువాయి

భారీ పెట్టుబడి రావడంపై తమిళనాడులో తీవ్ర చర్చ జరుగుతోంది. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తమిళనాడులోని మధురైలో జన్మించారని, అలాంటి తమిళ మూలాలున్న వ్యక్తి నేతృత్వంలోని సంస్థ నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం విఫలమైందని అన్నాడీఎంకే తీవ్రంగా ఆరోపిస్తోంది. ఈ అంశాన్ని అస్త్రంగా చేసుకుని డీఎంకే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇరు పార్టీల మధ్య జరుగుతున్న ఈ రాజకీయ వాగ్వాదానికి సంబంధించిన వీడియోను నారా లోకేశ్ తన పోస్టులో పంచుకున్నారు.

ఈ సందర్భంగా లోకేశ్ తనదైన శైలిలో స్పందించారు. సుందర్ పిచాయ్ ఆంధ్రప్రదేశ్‌ను కాదు, పెట్టుబడుల కేంద్రంగా భారత్‌ను ఎంచుకున్నారని ఒక్క మాటలో తేల్చేశారు. "%ఎజు జుూరూజు దీనారూ=ూూ%" (ఆయన భారత్‌ను ఎంచుకున్నారు) అంటూ తన పోస్టుకు వ్యాఖ్యను జోడించారు. ఈ ట్వీట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఎందుకు మీకీ కొట్లాట... ఆయన డేటా సెంటర్ పెడుతోంది భారత్ లోనేగా అని అర్థం వచ్చేలా... లోకేశ్ పేర్కొన్నారు. ఈ పెట్టుబడిని కేవలం ఒక రాష్ట్రానికి పరిమితం చేయకుండా, దేశ విజయంగా చూడాలన్న సందేశాన్ని లోకేశ్ తన పోస్ట్ ద్వారా తెలియజేశారు.ఇటీవల ఢిల్లీలో జరిగిన ఒప్పందం ప్రకారం, గూగుల్ సంస్థ విశాఖపట్నంలో తన డేటా సెంటర్, ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. రాబోయే ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 1.33 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖ నగరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా మారుతుందని ఏపీ ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఆస్ట్రేలియా పర్యటనలో నారా లోకేశ్ చొరవ...

- మొదటి పేజి తరువాయి

వైట్ స్పాట్ వైరస్ కారణంగా మన రొయ్యలపై ఉన్న అడ్డంకులు ఈ నిర్ణయంతో తొలగిపోయాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ శుభవార్తను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.ఈ పరిణామంపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "భారత రొయ్యల దిగుమతికి తొలిసారిగా ఆమోదం లభించింది. ఇందుకు విశేషంగా కృషి చేసిన భారత, ఆస్ట్రేలియా ప్రభుత్వాలకు మా ప్రగాఢ కృతజ్ఞతలు" అని ఆయన తెలిపారు. కేవలం ఒకే మార్కెట్‌పై ఆధారపడకుండా, నూతన మార్కెట్లను అన్వేషించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.తన పర్యటనలో భాగంగా, సముద్ర ఉత్పత్తుల వాణిజ్యంపై ఆస్ట్రేలియాతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు లోకేశ్ చర్చలు జరుపుతున్నారు. సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా (%ూ×ూ%) సీఈఓ వెరోనికా పాపకోస్టా, ఎంగేజ్‌మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్వేర్‌లతో ఆయన సమావేశమయ్యారు. సుస్థిర ఆక్వాకల్చర్, వాణిజ్య అవకాశాలపై వారితో చర్చించారు. "భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 60 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఈ ఎగుమతుల విలువ 7.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 66,000 కోట్లు)" అని లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.'గ్రేట్ ఆస్ట్రేలియన్ సీఫుడ్' పేరుతో సొంత బ్రాండ్‌ను సృష్టించి, తమ ఉత్పత్తులను ప్రీమియం మార్కెట్‌కు తీసుకెళ్లిన ఆస్ట్రేలియా విధానం తనను ఆకట్టుకుందని లోకేశ్ అన్నారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని, ఏపీ సీఫుడ్ పరిశ్రమకు అవసరమైన మద్దతు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.కాగా, అమెరికా సుంకాల వల్ల ఏపీలోని ఆక్వా రంగం సుమారు రూ. 25,000 కోట్ల నష్టాలను చవిచూసిందని, 50 శాతం ఎగుమతి ఆర్డర్లు రద్దయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెలలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆయన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌లకు లేఖలు రాశారు. అమెరికాపై ఆధారపడకుండా యూరోపియన్ యూనియన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా తీసుకున్న తాజా నిర్ణయం ఆక్వా రంగానికి కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

# పెన్ పవర్
## ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు


## జిల్లా ఎస్పీని కలిసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కప్పల సునీల్ కుమార్.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 21:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనాను మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన రామచంద్రపురం జిల్లా కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కప్పల సునీల్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనాకు ఆయన బొకే అందించారు. ఇటీవల జిల్లా కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా బాధ్యతలు చేపట్టిన సునీల్ కుమార్ జిల్లా అధికారులను మర్యాద పూర్వకంగా కలుస్తున్నారు.



## నగరం లో మైనర్ బాలిక అత్యాచారం?

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21**

నగరం లో ఒక ప్రభుత్వ హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్న 14 ఏళ్ళ మైనర్ బాలిక అత్యాచారనికి గురైన సంఘటన ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. హాస్టల్ నుండి బయటకు వెళ్ళిన మైనర్ బాలికను రావులపాలెం మండలం జొన్నాడకు చెందిన అజయ్ అనే 20 ఏళ్ళ యువకుడు రైల్వే స్టేషన్ సమీపంలో ఒక లాడ్జికి తీసుకు వెళ్ళి అత్యాచారం చేసినట్లు తెలుస్తుంది. అజయ్ స్నేహితుడైన మరో యువకుడు ఆ బాలికను మోటార్ బైక్ పై ఆ బాలికను దేవి చౌక్ సెంటర్‌లో వదిలి వెళ్లినట్లు తెలిసింది. హాస్టల్ వార్డెన్ బాలిక తల్లిదండ్రులకు బాలిక కనిపించడం లేదని విషయం చెప్పడంతో తల్లిదండ్రులు స్తానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. అయితే మైనర్ బాలికపై అజయ్‌తో పాటు మరో యువకుడు అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. భాధిత బాలిక పదవ తరగతి చదువుతున్నట్లు సమాచారం. ఈ సంఘనపై వసతిగృహా అధికారులు, పోలీసులు మాట్లాడానికి నిరాకరించారు. ఈ సంఘటన పై టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫోక్స్ కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నమని సి.ఐ. గణేష్ తెలిపారు.

## సమాజ భద్రతకు ప్రతీకగా పోలీసుల త్యాగం అమూల్యం





- మంత్రి కందుల దుర్గేష్
- ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ , ఎస్పీ లు
- పోలీసు అమర వీరులకు నివాళి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్21**

సమాజంలో శాంతి భద్రతలను కాపాడే కీలక బాధ్యత పోలీసులు నిర్వర్తిస్తున్నారని, కుటుంబం కంటే ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే పోలీస్ ల సేవలు అమూల్యమని రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సంక్షేమం పట్ల నిబద్ధతతో ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అని అన్నారు. అమరులైన పోలీసు సిబ్బందికి ఘన నివాళి అర్పిస్తూ రాజమహేంద్రవరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా పోలీసు అధికారి డి. నరసింహ కిషోర్ తదితరులు పాల్గొని పోలీస్ అమరుల త్యాగాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన 191 మంది అమరుల వీరోచిత సేవలను స్మరించుకోవడం గర్వకార ణమన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడక్ ప్రాంతంలో చైనా దాడుల సందర్భంగా సిఆర్పిఎఫ్ జవానులు ప్రాణత్యాగం చేశారు. ఆ సేవా స్ఫూర్తిని , వారి ప్రాణ త్యాగం ను స్మరించుకుంటూ నివాళులు అర్పించడం జరుగుతోందన్నారు. పోలీసులు ఆత్మ నిబద్ధతతో పనిచేయాలని, వారి కుటుంబ సభ్యుల సహకారం విలువైనదని గుర్తించాలని తెలిపారు. సభాధ్యక్షులు ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, దేశ భద్రత కోసం త్యాగం చేసిన అమరుల జ్ఞాపకార్థం నిర్వహించే ఈ కార్యక్రమం పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమన్నారు. మాదక ద్రవ్యాలు, సింథటిక్ డ్రగ్స్ వంటి సామాజిక సమస్యలను ఎదుర్కోవడంలో పోలీసు వ్యవస్థ మరింత కృషి చేయాలని పేర్కొన్నారు. తొలుత స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి గౌరవ వందనం సూచికగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, అడిషనల్ ఎస్పీలు (అడ్మిన్) ఎన్.బి.ఎం. మురళి కృష్ణ, (లా అండ్ ఆర్డర్) ఏ.వి. సుబ్బరాజు, (ఏ ఆర్) ఎల్. చెంచి రెడ్డి, డీఎస్పీలు (ఎస్.బి) బి. రామకృష్ణ, (నార్త్ జోన్) వై. శ్రీకాంత్, (ఈస్ట్ జోన్) బి. విద్య, (సౌత్ జోన్) కిషోర్, (కొవ్వూరు) దేవకుమార్, (ఏ ఆర్) రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే రబీ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా యూరియా నిల్వలు

### రబీ సీజన్‌లో యూరియా నిల్వలు, పంట నమోదు పై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్ష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ అక్టోబర్ 21**

రాబోయే రబీ సీజన్‌లో యూరియా కొరత లేకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుండి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తుగా సరిపడా యూరియా నిల్వలు కల్పించామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 3,214 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, రాబోయే రబీ సీజన్‌కు 55,000 మెట్రిక్ టన్నుల అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. జిల్లాలో వరిలో ఇ పంట నమోదు 100 శాతం పూర్తయిందని, ఇతర పంటలను కలుపుకుని మొత్తం 62 శాతం ఇ పంట నమోదు పూర్తయ్యిందని తెలిపారు. ఈనెల చివరి నాటికి పంటల నమోదును 100 శాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు జిల్లాలో 212 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, మిల్లర్ల నుండి బ్యాంకు గ్యారంటీలు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం వాహనాల రిజిస్ట్రేషన్ ను పూర్తి చేయాలని సూచించారు. స్వమిత్వ సర్వే కింద ఫేజ్-1 లో 64 గ్రామాలు, ఫేజ్-2 లో 102 గ్రామాలలో సర్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు. 99 శాతం గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి అయ్యింది అన్నారు. పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను సమర్థవంతంగా వసూలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత, భోజనం నాణ్యత, వార్డెన్ల పాటు విద్యార్థుల సంక్షేమంపై సమగ్రంగా పరిశీలించి నివేదికను సమర్పించాలని సూచించారు. గృహ నిర్మాణ పనుల్లో దశల వారీ కన్వర్షన్ పెండింగ్‌లో ఉన్న అన్ని గృహాలను పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రీవెన్స్ ఫిర్యాదులపై సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, డి ఆర్ వో టి సీతారామ మూర్తి, డి ఏ ఓ ఎస్ మాధవ రావు, డీపీ ఓ శాంతమణి, డి డి ఓ వీణా దేవి, ఏడి సర్వే బి లక్ష్మీనారాయణ, సీపీఓ అప్పాలకొండ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యా! కరువు భత్యం మంజూరు చేశారు సరే కానీ పాత పద్ధతిని మరిచారా?

**ఏపీ వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ & ఫెడరేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ పరిశిక. అప్పన్నబాబు**



**గంగవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 21:** ఎంతో కాలంగా 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ ఎదురు చూస్తున్న దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న డి ఎ బకాయిలు, పిఆర్సి బకాయిలు, ఇప్పటికి పెండింగ్ లో ఉన్న నాలుగు డిఎ లలో ఒక డి ఏ నిమిత్తం జీవో నెంబర్ 60మరియు 61 ద్వారా మంజూరు చేసి జనవరి 2024 రావాల్సిన ఆరియర్స్ మాత్రం పదవీవిరమణ తదంతరం వారి వారి ఖాతాల్లో జమచేస్తామనడం, ఇందులో సిపిఎస్ ఉద్యోగుల గురించి ప్రస్తావన లేకపోవడం ఉద్యోగుల లో నిరాశను మిగిల్చిందని ఏపీ వెటర్నరీ ఆఫీసర్స్ %d% ఫెడరేషన్ వైస్ ఛైర్మెన్ డాక్టర్. పరిశిక. అప్పన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు . ముఖ్యమంత్రి, మంత్రుల కమిటీ లో ఉద్యోగ సంఘాలు అడిగిన సమస్యలైన డి ఎ బకాయిలు, పిఆర్సి బకాయిలు, సరెండర్ లీవు బకాయిలు, జిపిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ ఋణములు, ఆరోగ్యశ్రీ పథకం అమలు మరియు పిఆర్సి కాలం ముగిసి రెండు సంవత్సరాలు కావస్తున్నందున పి ఆర్ సి కమిటీ ఏర్పాటు చేయవలిసిందిగా కోరితే నేరుగా పరిస్కారం చూపకుండా ఉద్యోగుల కంటి నీటి తుడుపుగా చర్యగా 2024 జనవరి నెల నుండి రావలిసిన నాలుగు డిఎ లలో ఒక డి ఎ మంజూరు చేసారని,సరెండర్ లీవు మాత్రం పోలీసు శాఖ వారికి రెండు విడతల్లో చెల్లిస్తామనడం, మిగతా శాఖ ల ఉద్యోగస్తుల పరిస్థితి ఏమిటని, ప్రభుత్వం నకు ఉద్యోగులే రధచక్రాలు ముఖ్యమంత్రి గ అన్నట్లు గా ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేస్తూ అటు ప్రభుత్వం నకు ఇటు ప్రజలకు వారధి లా పనిచేస్తున్నా ఉద్యోగుల పై ప్రభుత్వం చూపే ప్రేమ ఇదేనా అని అన్నారు. ఎన్నికలకు ముందు ఒక సమావేశం లో ఒక రిటైర్డ్ ఉద్యోగి అడిగిన ప్రశ్నకు మాది ఉద్యోగ సంక్షేమ ప్రభుత్వం అధికారం రాగానే పిఆర్సి కమిటీ వేసి సగటు ఉద్యోగిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం కంటే మెరుగైన పిఆర్సి ఇస్తామని,పెండింగ్ లో ఉన్న బకాయిలన్ని పూర్తి స్థాయిలో చెల్లిస్తామన్నారని, పొరుగు సేవలు ఉద్యోగస్తులకు జీతాలు పెంచి,వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అన్నారని ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలవుతున్నప్పటికీ వాటిని అమలుచేయకపోవడంతో ఉద్యోగులు నిరాశ, నిస్ప్రుహలతో ఉన్నారని అయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవో నెంబర్ 60, 61 సవరణ చేసి, మరియు పిఆర్సి-2022రావలసిన బకాయిలు పై, డి ఎ బకాయిలు, సరెండర్ జిపిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ, ఋణములో చెల్లింపులు చేసి, ఉద్యోగులు ఎదురుచూసే పిఆర్ సి కమిటీ , రిపోర్ట్ వచ్చే దాకా ఉద్యోగులకిచ్చే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని అయన ప్రభుత్వం ని కోరారు.

## కాకినాడ మున్సిపల్ కొత్త భవన నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్ షణ్మోహన్

### పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచనలు





**కాకినాడ, అక్టోబర్ 21 ,పెన్ పవర్** :కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి షణ్మోహన్ మంగళవారం పరిశీలించారు. సినిమా రోడ్‌లో నిర్మాణ దశలో ఉన్న భవనాన్ని ప్రత్యక్షంగా సందర్శించిన ఆయన, మున్సిపల్ అధికారుల నుంచి పనుల ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ పి. వెంకటరావు భవన నిర్మాణ పనుల వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. ప్రస్తుతం చారిత్రాత్మకమైన పాత భవనంలో కౌన్సిల్ సమావేశాలే నిర్వహిస్తున్నామని, కొత్త భవనం పూర్తయితే ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని అధికారులు తెలిపారు.నూతన కార్యాలయ భవనం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవా లని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ పరిశీలనలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, డీసీపీ కృష్ణారావు, ఎంహెచ్ఓ డా. పృథ్వీచరణ్, ఏఈలు, డీఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కుల రాజకీయాలు చేస్తున్న వైసీపీ

- గత ప్రభుత్వంలో హత్యలు, దారుణాలు
- జరిగితే జగన్ ఏమయ్యారు ?
- జనసేన నేత పవన్ కళ్యాణ్ జోలికొస్తే
- సహించేది లేదు
- మీడియా సమావేశంలో
- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- జనసేన జిల్లా అధ్యక్షుడు వైస్ శ్రీనివాసు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:** రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వైసిపి పార్టీ నేతలు కుల రాజకీయాలు చేస్తున్నారని రాజానగరం నియోజవర్గం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో జరిగే ప్రతి సంఘటనను జనసేన నేత పవన్ కళ్యాణ్ కు వైసీపీ ముడిపెడ్తోందని, వైసిపి వారు ఆయన జోలికి వస్తే సహించేది లేదని బత్తుల హెచ్చరించారు. స్థానిక స్వగృహంలో మంగళవారం ఆయన జనసేన జిల్లా అధ్యక్షుడు వై శ్రీనివాస్ తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ , నెల్లూరు జిల్లా, కందుకూరు గ్రామంలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్య ను వైసీపీ నేతలు కుల రాజకీయాలు చేసి ప్రజల్లో అశాంతిని రేపుతున్నారని మండిపడ్డారు. ఈ సంఘటనతో ఎలాంటి సంబంధం లేని జనసేన నేత పవన్ కళ్యాణ్ ను మొదటి ముద్దాయిగా పేర్కొనడం వెనుక రాజకీయల లబ్ధి కోసం వైసిపి కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు నియంత్రణలో ఉన్నాయని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం పథకాలు అందుతున్నాయని , మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉండడం వైసిపి అధినేత జగన్ కు, ఆ పార్టీ నాయకులు సహించలేక పోతున్నారని , దాంతో కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరు సంఘటన ను ఖండిస్తున్నామని, రాష్ట్ర మంత్రులు, కూటమి నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారని ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సహాయ ,సహకారాలు అందిస్తామని మనోధైర్యం కల్పించారని బత్తుల గుర్తు చేశారు. వైసీపీ నాయకులు బాదిత కుటుంబాన్ని పరామర్శించడం , సానుభూతితో సహాయం చేయడం లో తమకు అభ్యంతరం లేదని, అయితే బాధితులను అడ్డం పెట్టుకొని వైసిపి స్వార్థ రాజకీయాలు చేస్తే జనసేన చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అన్ని పార్టీల్లోని కాపుల మధ్య చిచ్చు పెట్టాలని జగన్ కుతంత్రాలు పన్ను తున్నారని కాపుల ఐక్యత ను దెబ్బతీయడం ఎవరి తరం కాదన్నారు. గత ప్రభుత్వంలో ఇంతకన్నా దారుణ హత్యలు, దళితుల హత్యలు , రైతుల ఆత్మహత్యలు జరగాయని అప్పుడు జగన్ ఏమయ్యారని బత్తుల ప్రశ్నించారు. తాడేపల్లి ,బెంగళూరు ప్యాలస్ లు విడిచి జగన్ రాలేదని , రాష్ట్రంలో ప్రతిపక్షం బాధ్యత ఇవ్వకుండా ప్రజలు 11 స్థానాలకే ఇంట్లో కూర్చోబెట్టిన సంగతిని గుర్తు చేసుకోవాలన్నారు. గత ఐదేళ్ల వైసిపి హయ్యాంలో ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు పోలవరం ప్రాజెక్టులో ఒక మట్టి తట్ట వేయలేదని ఎప్పుడు సంబరాలు చేసుకుంటునే గడిపేవాడని ఎద్దేవా చేసారు. రాజనగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కాపు కార్పొరేషన్ చైర్మన్ గా కాపుల సంక్షేమానికి ఉపయోగపడే రుణాలు, విదేశీ విద్య ప్రోత్సహించిన దాఖలాలు లేవని, పి గన్నవరంలో ప్రజా సమస్యల పై మాట్లాడిన జనసేన వీర మహిళలను అసభ్యంగా మాట్లాడిన చరిత్ర, దళితుడి ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తితో ఊరేగిన చరిత్ర జక్కంపూడి దని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ తో సహా జగన్ వర్గీయులు కుట్ర, కుల రాజకీయాలను ఇదే విధంగా చేస్తే మరో 10 ఏళ్ళు అయినా రాష్ట్రంలో వారికి అందలం ఎక్కరన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు వై. శ్రీనివాసు మాట్లాడుతూ, కందుకూరు కందుకూరులో వ్యక్తిగత కక్షలతో హత్య జరిగిందని దాన్ని వైసిపి కులాలతో ముడిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని వైసిపి నేత జగన్, అతని వర్గీయులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సంఘటనను రాష్ట్ర ప్రజల్లో తప్పుదోవ పట్టించేందుకు సంబరాల రాంబాబు, జక్కంపూడి రాజా, నరేంద్ర లు కుల రాజకీయాలు చేస్తే జనసేన చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

## అన్నదానంకు మించిన దానం మరేది లేదు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21,** అన్నదానంకు మించిన దానం లేదని, ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టే వారే నిజమైన సమాజ ప్రేమికులని పలువురు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ ఐటి ప్రాజెక్ట్ అడ్వైజర్ పెన్నమరెడ్డి నాగబాబు జన్మదినం ను పురస్కరించుకొని ఆయన బంధువులు,అభిమానులు అంబాజీపేటలో పుట్టినరోజు కేకును కట్ చేసి నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అమలాపురం రూరల్ మండలం బండారులంక షిరిడి సాయిబాబా ఆలయం సమీపంలోని నిత్య అన్నదాన సత్రంలో జన సైనికుడు మైపాల తాతాజీ ఆధ్వర్యంలో బీదలకు అన్నదానం చేశారు. అన్నదాన సత్రం నిర్వాహకులు,ప్రముఖ సిద్ధాంతి కాలెపు భీమేశ్వరరావు మాట్లాడుతూ అన్నదానంకు మించిన దానం లేదని, మానవులతో పాటు ఏ జీవినైనా కడుపు నింపే తృప్తి పర్చగలమన్నారు. పేదలకు, బీదలకు, వృద్ధులకు అన్నదానం చేయడం మహా పుణ్యకార్యమన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్ముల బాబి, రవణం రాము, వర్రె శేషు,కామిశెట్టి పండు,మంచాల సతీష్, మేడిది శ్రీను,సూదాబత్తుల రవి, వాకపల్లి నాగబాబు, బందన రంగ, రవణం విజయ్, నందెపు శ్రీను తదితరులు ఉన్నారు.

## శాలివహన అందరూ ఐక్యతో ఉండాలి

- అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మం



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21**
శాలివాహన సంఘియులంతా ఐక్య తో ఉండాలని అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మం అన్నారు.
శాలివాహన సంక్షేమ సంఘం సమావేశము మాచవరం సంఘ భవనం నందు కార్యదర్శి దాలపర్తి భీమేశ్వరావు అధ్యక్షతన సమావేశం జరిగింది.
ఈ సమావేశం లో అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మం హాజరై మాట్లాడుతూ శాలివాహన సంఘీయులంతా ఐక్యతతో మెలగాలని మన సంఘ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.
శాలివాహన సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని అన్నారు. వన సమారాధన ఈనెల 16 తేదీన ఆదివారము జరుపుటకు సంఘము నిర్ణయము తీసుకున్నది. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు వెల్లా త్రిమూర్తులు, సంఘ సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ యువజన నాయకుడు పాలకొల్లు వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ మంతెన శ్రీనివాస్, అయినవిల్లి మండల అధ్యక్షులు తాడినాటి ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి యెడిద రమేష్, అమలాపురం మండల అధ్యక్షులు కోటిపల్లి సత్యనారాయణ, అల్లవరం మండల అధ్యక్షులు బట్టిలంక వీర వెంకట సత్యనారాయణ, దేవగుప్తాపు నాగేంద్ర, తానేలంక శ్రీనివాస్, టీ వెంకటేశ్వరరావు, ఆదుర్తి ఓం నమశ్శివాయ, చిరత పూడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట మండల అధ్యక్షులు రాయపూడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ ర్యాలీ భాస్కర్, సూరిబాబు పసలపూడి శ్రీనివాస్, ఆదుర్తి నారాయణ మూర్తి, సంఘ నాయకులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపరచుకోండి - డాక్టర్ ఆశిష్



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21:** ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచు కోవాలని అమలాపురం ఏఎస్ఏ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.శివ.ఆశిష్ కోరారు.
మంగళవారం అంబాజీపేట మండలం మాచవరం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ఉచితంగా ఏర్పాటుచేసే వైద్య శిబిరాల్లో తమ ఆరోగ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించు కోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యవంతులుగా మెలగాలని డాక్టర్ ఆశిష్ పేర్కొన్నారు. సేవా పరంగానే ఖరీదైన వైద్యాన్ని నిరుపేదలకు అందించాలనే ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎం.శివ ఆశిష్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మరియు షుగర్ వైద్య నిపుణురాలు డాక్టర్ గుండా బత్తుల అంజలి పలువు షుగర్ రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు.అనంతరం ఆర్థోపెడిక్, కీళ్ళ వ్యాధినిపుణులు డాక్టర్ సిహెచ్. సురేష్, శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నర్రా శ్రీనివాసులు, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ మత్తే అనూష, మానసిక వైద్య నిపుణురాలు పసుపులేటి సౌమ్య లు రోగులకు పలు చికిత్సలు నిర్వహించారు. ,ఊపిరితిత్తులు, గుండె కీళ్లు,నరాలు, తదితర సమస్యలతో బాధపడుతున్న రోగులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాచవరం గ్రామస్తులు మాట్లాడుతూ ఏఎస్ఏ హాస్పిటల్లో ఎంతో పేరుగాంచిన వైద్యులు తమ గ్రామంకు వచ్చి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి తమ అనారోగ్య సమస్యలను, దీర్ఘకాలిక రోగాలను నయం చేసేందుకు ముందుకు వచ్చిన వైద్యులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది రోగులు బారులు తీరు మరి వైద్య శిబిరం వద్ద కు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఏ హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ జయశ్రీ ఏ ఎస్ కే హాస్పిటల్ పిఆర్ఓ రాయుడు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం ధనలక్ష్మి, నాగేంద్ర సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆలయాభివృద్ధికి కృషి - ఎమ్మెల్యే బండారు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని దేవాదాయ కమిషనర్‌కు విజ్ఞప్తి



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 21** :కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్‌ను కోరారు.
మంగళవారం విజయవాడ గొల్లపూడిలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, ఆలయంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని మౌలిక వసతులు, వసతి గృహాలు, రహదారి సదుపాయాలు, పార్కింగ్ ప్రదేశాలు, శ్రీవారి దర్శనానికి క్యూలైన్ కాంప్లెక్స్ వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.
శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి వారాంతంలో వేలాదిమంది భక్తులు, ముఖ్యంగా శనివారాల్లో వివిధ రాష్ట్రాల నుండి లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించడం అత్యవసరం. అందుకే అనుమతులు తక్షణం మంజూరు



చేయాలని కమిషనర్‌ను కోరాను,” అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.
ఈ సందర్భంగా కమిషనర్ రామచంద్ర మోహన్ ఆలయ అభివృద్ధి పనులపై సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు విధిగా తనిఖీ చేయాలి

హుకుంపేట పంచాయితీ డి.బ్లాక్ లో సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:**గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు విధిగా తనిఖీ చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం హుకుంపేట పంచాయితీ డీ.బ్లాక్ నందు నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను, పారిశుద్ధ్య పనులను పరిశీలించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రూరల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించమన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు ఆక్రమణలు తొలగించడం సహజమని, డ్రైనేజీ నిర్మాణ పనులు జాప్యం అవుతాయని వివరించారు.
నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా మురుగునీరు బయటకు మురుగునీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నారని స్థానిక మహిళలు గోరంట్లకు చెప్పారు మురుగునీరు బయటకు పోయేందుకు సహకరించాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో మొత్తం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి డ్రైనేజీ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని సర్వే చేసి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. .
అనంతరం సాటిలైట్ సిటీ సి.బ్లాక్ నందు కళ్యాణ మండపం నిర్మాణ పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డి.ఇ రవికుమార్, ఏ.ఈ సంపత్ కుమార్, వాసిరెడ్డి బాబి, పెండ్యాల రామకృష్ణ, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, సోమేశ్వరరావు, హీరా సింగ్, చామాండ్రి నాని, ఏఎంసీ డైరెక్టర్ బైరెత్తి సరోజినీ, నిచ్చినకోళ్ల సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను, దారా అన్నవరం, పెంకె కోటేశ్వరరావు, బండారు సత్తిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీరరాఘవులను పరామర్శించిన కూటమి నేతలు



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 21** :మండలంలోని వెదుళ్ళకుంట గ్రామానికి చెందిన బిజెపి నాయకులు బొడ్డు వీరరాఘవులు పితృమూర్తి రామకృష్ణ పరమహంస అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి కూటమి నాయకులతో కలిసి రాఘవులు ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.అనారోగ్యానికి గురైన కారణాలను కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు,టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కొర్లపాటి రాము,గోపాలపురం సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేష్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గెల్లా శ్రీనుబాబు,జొన్నలగడ్డ ప్రసాద్,జ్యేష్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ కాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 21:** జగంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే డొక్కా సీతమ్మను పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుంటే ఆయన్ను తుమ్మలపల్లి రమేష్ స్ఫూర్తిగా తీసుకుని తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి ఇరుముడి సమర్పణ



**ఏలూరు అక్టోబర్ 22 పెన్ పవర్** : భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో 41 రోజులపాటు అయ్యప్ప స్వామి వారి దీక్షను చేసిన ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు మంగళవారం శబరిమలై అయ్యప్పను దర్శించుకుని ఇరుముడి సమర్పించారు. అయ్యప్ప స్వామి వారి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు వెళ్లిన పలువురు అయ్యప్ప భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు..

# మేయర్ మనవడు పుట్టినరోజు వేడుకలు



**ఏలూరు అక్టోబర్ 21 పెన్ పవర్ :** ఏలూరు నగర మేయర్ మనవడు దేవాన్ష్ కు అయ్యప్ప స్వామి మరియు మాల ధారణ చేసిన స్వాములు ఆశీస్సులు అందించాలని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ శ్రీమతి షేక్ నూర్జహాన్-ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు కోరారు. తమ మనవడు షేక్ దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక దొండపాడు లోని బాల అయ్యప్ప క్షేత్రంలో మంగళవారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు,స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ కమిటీ సభ్యులు కార్తీమాసం రోజుల్లో స్వాములకు భిక్ష కార్యక్రమ%శీ% ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. మ మనవడు దేవాన్ను పుట్టినరోజు సందర్భంగా భిక్ష ఏర్పాటు చేయడానికి తమకు అవకాశం కల్పించినందుకు కమిటీ సభ్యులను అభినందించారు. స్వాములు మనస్ఫూర్తిగా బిక్షను ఆరగించాలన్నారు. తమ మనవడు దేవాన్ష్కు మాలధారణ చేసిన స్వాములందరూ ఆశీస్సులు అందించాలని మేయర్ నూర్జహాన్ పెదబాబు కోరారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ మూర్తి





**గంగవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 21:** ప్రజల రక్షణ కోసం, సమాజంలో శాంతి భద్రతల స్థాపన కోసం నిత్యం పోలీసులు పాటుపడతారని, విధి నిర్వహణలో అమరులైన పోలీసులత్యాగలు మరువలేనివని అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం పోలీసుఅమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా గంగవరం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థిని విద్యార్థులతో కలసి వై జంక్షన్ లో మానవహారం చేపట్టారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959అక్టోబర్ 21న చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి అమరులైన 10మంది సిఆర్పిఫ్ జవానులను గుర్తు చేసుకుంటూ ఈ దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. పోలీసులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, వారి కుటుంబ సంతోషాలకంటే, ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తారని అన్నారు. ప్రజలు కూడా పోలీసులను తమ నేస్తాలుగా భావించాలన్నారు. అలాగే పోలీసు వ్యవస్థ పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ లు రజాక్, మహర్షి, ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు దొర ,పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నెల రోజులు కార్తిక వన సమారాధన కమిటీ ..

- కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వన సమారాధన..
- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..



కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 21: కోరిన కోర్కెలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నెలరోజుల పాటు కార్తిక వన సమారాధనకు ఎమ్మెల్యే బత్తుల కమిటీ ఏర్పాటు.ఈ సందర్భంగా నెలరోజుల పాటు జరుగు కార్తీక వన సమారాధనకు బుధవారం ఉదయం పది గంటలకు కూటమి నాయకులతో మీటింగ్ ఏర్పాటు చేసి భక్తులకు అన్న ప్రసాదం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు అందరూ హాజరు కావాలని ఎమ్మెల్యే బత్తుల పిలుపునిచ్చారు..

# టిడిపి మండలఅధ్యక్షులుతో పెన్.పవర్.ఇంటర్వ్యూ

టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్,



**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.21**తెలుగుదేశం పార్టీ కోసం అధికారంలోకి రావడానికి రాత్రి పగలు తేడాలేకుండా పనిచేశానని,చేస్తూనే ఉంటానని తెలుగుదేశం పార్టీ మండలఅధ్యక్షులు బొర్రానరేష్, కుమార్,స్పష్టం చేశారు.మంగళవారం పెన్ పవర్.మీడి యాతో కొన్ని అనుభవాలు పంచుకున్నారు.ప్రశ్న-సుదీ ర్ఘంగా సంత్సరంఆరునెలలోఅనంతరం వరరామచంద్రా పురం మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుగా ఎన్నిక య్యారు.లాంఛనమే అయినా మెజారిటీ ఓటింగ్,తోహ్యా ట్రిక్,విజయంసాధించి,నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.ముందుగా మా పెన్.పవర్.దినపత్రిక తరుపున శు భాకాంక్షలు,అధ్యక్షులుగా మీ ప్రయాణం గురించి కొన్ని విషయాలు?జవాబు-ముందుగా ఊహించిందే అయినా పోటీలో తెలుగుదేశం పార్టీ సభ్యులు అద్భుతంగా ఓటింగ్ వేశారు.అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధి దిశగాఅడుగులు వేస్తాను. అందరికీ అందుబాటులోఉండి సహాయసహకారాలు అందిస్తానని,మీడియాముఖంగా వివరించారు.ప్రశ్న-మన వరరామచంద్రాపురం,మండలంలో పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులసమస్యలు,పరిస్థితిపై అధ్యక్షులుగా మీభాధ్యత పైమీ అభిప్రాయం జవాబు వరరామచంద్రాపు రంమండల ప్రజలు ఎదుర్కొనే ప్రదానసమస్య పోలవరం అందరి ఆశయాలకు అనుగుణంగా ముందుగా పోలవరం నిర్వాసితుల సమస్యలుఅధిష్టానం దృష్టికి తీసుకువెళ్తా నని,అందరికీ న్యాయంచేసే సందర్భంలో ప్రతీ ఒక్కరికీ న్యాయం దిశగాప్రయత్నం చేస్తానని చెప్పారు.ప్రశ్న-గోదా వరివరదలు ప్రజలఇబ్బందులు మీకు అన్నీ తెలిసిందే, సుమారు మూడునెలలుగా ప్రజలునానా బాధలు పడ్డారు. మీకు తెలిసిన విషయమే జవాబు-జిల్లా కలెక్టర్ తో అన్నీ సమస్యలు వివరించానని,త్వరలో ప్రతీ కుటుంబానికి వరదసహాయం తప్పకుండా అందుతుందని,శాసనసభ్య రాలు మిరియాలు శిరీషా భాస్కర్,మాట్లాడానని,స్పష్టం చేశారు.ప్రశ్న-రేఖపల్లి అంబేద్కర్ కాలనీ సమస్యలపై మీప్రతిస్పందన వివరించండి?జవాబు-రేఖపల్లి అంబేద్కర్ కాలనీ వాసులు సమస్యలు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లామని,త్వరలో తీఫికబురువస్తుందని,ఈ ప్రయత్నంలో మిరియాల శిరీషా భాస్కర్,ఆధ్వర్యంలోఅన్నీ సవ్యంగాసా గుతున్నాయని,ఆశించిన ఫలితం వస్తుందని,వివరించారు ప్రశ్న- అన్నవరం వాగుపై వంతెన పనులు ఎప్పుడు ప్రారం భిస్తారో అర్థం కాని పరిస్థితి ఈ విషయంపై క్లారిటీ ఏంటీ?జవాబు-మంచి ప్రశ్న వేశారు.వంతెన నిర్మాణం తప్పకుం డాతెలుగుదేశం ప్రభుత్వం చేస్తుంది.కొద్దిగా వర్షాలుతగ్గిన తర్వాత పనులు ప్రారంభం అవుతాయి.డైవర్షన్ రహదారి నిర్మాణంకూడా త్వరలో పరిష్కారంఅవుతుంది.ప్రశ్న-మం డలంలో అంతర్గత రహదారుల,పరిస్థితి పై మెయిన్,రహ దారిలోడ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లుపై నీటి నిల్వలు ఉండి, రహదారులు బాగా దెబ్బతిన్నాయని,వాటిపై కొన్ని విష యాలు ప్రజల కోసం?జవాబు-మండలంలో అంతర్గత రోడ్లు,మెయిన్ రోడ్లపై డ్రైనేజీ తదితర అంశాలపై పార్టీ ప్రజాప్రతినిధులతో నాయకులతో చర్చించి,అందరి సహ కారంతో అధిష్టానం దృష్టికి,మనశాసన సభ్యురాలు మిరియాలు శిరీషా భాస్కర్,దృష్టిలో పెట్టి డ్రైనేజీ వ్యవస్థ కోసం శాయశక్తులా ప్రయత్నం చేస్తానని,చెప్పారు.ప్రశ్న-గత 3 నెలలుగా వ్యవసాయభూములు గోదావరి ముంపులోనే ఉన్నాయని,వ్యవసాయానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని,అధ్యక్షులుగా ముంపునకుగురైన భూములపై మీఅభిప్రాయం?జవాబు-అన్నీ విషయాలు అందరంకూర్చోని పార్టీనియమాలకు అనుగుణంగా కలిసి నిర్ణయం తీసుకుంటామని,ఈ సమస్యలు మంత్రులు,లోకేష్ బాబు,నిమ్మల రామా నాయుడు,శాసన సభ్యురాలు శిరీషా భాస్కర్,దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం దిశగా ప్రయత్నం చేస్తామ న్నారు. ప్రశ్న-విద్యావ్యవస్థ,ఆరోగ్య సమస్యలపై ముఖ్యం గా మహిళలుకోసం వరరామచంద్రాపురం,మండల రేఖప ల్లి పి.హెచ్.సి.లో మహిళా గైనికాలిస్టు డాక్టర్,ను ఏర్పాటు చేస్తే అందరికి బాగుంటుందని,మీదృష్టికి తీసుకువస్తున్నా?జవాబు-శాసన సభ్యురాలు మిరియాల శిరీషా భాస్కర్, దృష్టిలో విషయాన్ని వివరించి,చెప్పితప్పకుండా మహిళా గైనికాలిస్టు ఏర్పాటు కోసం తప్పనిసరి ప్రయత్నం చేస్తాన ని మీఅందరి సహాయసహకారాలు అందించాలని,అలాగే నిరుద్యోగ యువత సమస్యల పరిస్కారం కోసం శాసన సభ్యురాలు మిరియాల శిరీషా భాస్కర్,తో మాట్లాడి జిల్లా కలెక్టర్,తో మాట్లాడి జాబ్ మేళా ఏర్పాటుకునాశక్తి మేరకు ప్రయత్నం చేస్తానని,విద్యా అభివృద్ధికి విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు అద్భుతమైన పథకాలు,డిఎస్సీ,ఇంకా తల్లి కి వందనం,తదితర పథకాలతో ముందుకు వెళ్తున్నారని వివరించారు.చివరిగా రాబోవు పంచాయతీ ఎన్నికల్లో చిన్నాపెద్దా తేడాలేకుండా అందరినీ కలుపుకొని కూటమి తరపున,ఎవ్వరూ ఊహించని రీతిలో గ్రామ పంచాయితీ లు కైవసం చేసుకొనిసత్తా చాటుతామని,కూటమి ప్రభు త్వం చేస్తున్న అభివృద్ధి,కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షే మం,దృష్టిలో పెట్టుకొని ప్రచారంలో ముందుకు వెళ్తామని, అన్నీ సమిష్టి నిర్ణయాలు,సమిష్టిగాపనులు,సమిష్టివిజ యాలు,చూస్తామని చెప్పారు.ప్రజలు తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు,నాయకులు చిన్నా పెద్దా తేడా లేకుండా,అందరం కలిసికట్టుగా పార్టీకోసం తప్పనిసరి పనిచేసి మెజారిటీ స్థానాలుకూటమి కైవసం చేసుకుం టుందని,దీమావ్యక్తం చేశారు.అన్నీ సమిష్టి విజయాలు సమిష్టి నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు.(ముగిస్తూ మళ్లీ కొన్ని విషయాలతో కలుద్దాం వచ్చేసంచికలో

# ప్రధానమంత్రి బీమా పథకాలలో అడ్డతీగల యూనియన్ బ్యాంక్ దేశంలోనే ప్రథమస్థానం..





**అడ్డతీగల,పెన్ పవర్,అక్టోబర్ 21:** దేశవ్యాప్తంగా ఉన్న 8,700 యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లలో అడ్డతీగల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ అత్యుత్తమగా భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. వివరాల్లోకి వెళితే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన ,ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల అమలులో అగ్రగామిగా నిలవడంపై స్థానికులు, వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు.బ్రాంచ్ మేనేజర్ బి.ఎస్.హెచ్. ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో 1,176 మంది, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో 1,544 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకాలపై మరింత అవగాహన పెంచి, ప్రతి ఖాతాదారుడికి ఈ అవకాశాన్ని అందుబాటులోకి తీసుకురావడం మా లక్ష్యం అని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన

436 రూపాయలు వార్షిక ప్రీమియంతో ఈ పథకాన్ని పొందవచ్చు. ఈ పథకంలో సభ్యుడు మరణించిన సందర్భంలో కుటుంబానికి 2 లక్షల బీమా పరిహారం లభిస్తుంది అని బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. ఈ పథకం 18 నుండి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులకు వర్తిస్తుంది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన

కేవలం 20 రూపాయలవార్షిక ప్రీమియంతో ఈ పథకాన్ని పొందవచ్చు. యాక్సిడెంట్ కారణంగా మరణించిన లేదా పాక్షిక వికలాంగత కలిగిన 2 లక్షల వరకు బీమా ప్రయోజనం లభిస్తుంది. బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ ఖాతాదారులకు వివరిస్తూ,ఈ పథకాలు గ్రామీణ ప్రజలకు పెద్ద స్థాయి భరోసా ఇస్తుందని,తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం అందించే ఈ పథకాలను, ప్రతి కుటుంబం తప్పక వినియోగించుకోవాలి అని అన్నారు.

ఈ పథకాల అమలులో ముమ్మిడి భరత్ కుమార్ అత్యధిక సంఖ్యలో పాలసీలు చేయడం ద్వారా విశేషంగా కృషి చేశారనిమేనేజర్ అభినందించారు.ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ బి.జి.ఆర్. నాయుడు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సునీత ప్రుస్టీ , ఫైనాన్షియల్ ఇంక్లూజన్ నోడల్ అధికారి అన్నం. శ్రీనివాస్, అడ్డతీగల బ్రాంచ్‌కి వచ్చి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండి %డ% సీఈవో ఆశిష్ పాండే మార్గదర్శకత్వంలో నిర్వహించబడింది అని బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సమీర్ రంజాన్, ఫీల్డ్ ఆఫీసర్ అభినవ్, మణిదీప్, సునీత, విజయలక్ష్మి, మరియు బ్యాంక్ సిబ్బంది ఖాతాదారులు, బీసీ పాయింట్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం విడుదల చేసిన -అందని స్కూల్ గ్రాంట్లు

**వై రామవరం పెన్ పవర్ అక్టోబర్ 21:** ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలకు గ్రాంట్లు ప్రభుత్వం మంజూరు చేసిన నేటికీ అందలేదని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మెగా పేరెంట్స్ మీటింగ్ కు ముందుగానే ఆయా పాఠశాలలకు స్కూల్ గ్రాంట్లు విడుదల చేసినట్లు తెలిసింది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల స్ట్రెంత్ ను బట్టి కాంపోనెంట్ గ్రాంటుగా సగం నగదు విడుదల చేసినట్లు తెలిసింది. సంబంధిత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పిఎఫ్ ఎంఎస్ ఎకౌంటు ద్వారా వెండర్ కు నగదు బదిలీ అవుతుందని తెలిసింది. నెలలు గడుస్తున్నా నేటికీ ఉపాధ్యాయులకు స్కూలు గ్రాంట్లు అందలేదని అనడం విశేషం. వెండర్ గా సరుకు సరఫరా చేసిన ఏ వ్యక్తినైనా పెట్టవచ్చని, అతని అకౌంట్లోనే నగదు జమ అవుతుందని అంటున్నారు. టర్మ్ రెండవ దఫా శిక్షణా కార్యక్రమం కు వచ్చిన ఏ ఎస్ ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి, స్కూల్ గ్రాంట్ల విషయమై ఉపాధ్యాయులను అడిగినట్లు తెలిసింది. స్కూల్ గ్రాంట్ల విషయమై పనసల పాలెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడును అడుగగా అందలేదని సమాధానం ఇచ్చారు. మండలంలో ఏ ఒక్క పాఠశాలకు స్కూల్ గ్రాంట్లు విడుదల కాలేదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ విషయమై వై రామవరం ఎంఈఓ 1 కే. తాత బ్బాయి దొరను వివరణ కోరగా 80 శాతం ఆన్లైన్ పని పూర్తి అయినాయని అనడం విశేషం.




# బాధితులకు ఆర్థిక సాయం అందించాలి.



**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 21**ఇటీవల మండపేట నియోజకవర్గం రాయవరం మండలం కొమరిపాలెం బాణాసంచా తయారీ పేలుడు ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎటువంటి పరిహారం చెల్లించకపోవడం దారుణం అని %వీ౹ాా% రాష్ట్ర సీనియర్ నాయకులు దూళి జయరాజు అంగర గ్రామ సర్పంచ్ లు అసహనం వ్యక్తం చేశారు. మండలం లోని అంగర గ్రామ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం వారు ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు50 లక్షలు పరిహారం చెల్లించాలని అలాగే ఒక ప్రభుత్వ ఉద్యోగం కూడా కల్పించాలని జయరాజు డిమెండ్ చేశారు. ఈ విషయం పై ప్రభుత్వం స్పందించక పోతే కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇంటి ముందు వామ పక్షల నేతలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు

# ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:**ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో మండలములోని మోహనాపురం ఎల్లాపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆశ్రమం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ రావు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గిరిజనులకు అవసరమైతే విశాఖపట్నం తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ వీరపురెడ్డి, ఆంధ్రవనవాసి కళ్యాణ ఆశ్రమం ప్రతినిధులు కాటంరెడ్డి ,రామకృష్ణారెడ్డి ,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పాటించాలి: ఎస్ జి వి సుబ్బరాజు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 21:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పాటించాలని నీటి సంఘం అధ్యక్షులు ఎస్ జి వి సుబ్బరాజు అన్నారు. మండల పరిధి లింగంపర్తి గ్రామ సచివాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ యార్లగడ్డ చంద్రలేఖ అధ్యక్షతన జరిగిన సభలో సుబ్బరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో గతంలో అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడా అటువంటి ఆరోపణలు రాకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాలన్నారు. మన ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని సకాలంలో రైతులకు సాగునీరు అందేలా పనులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా అవకతవకులు జరిగినట్లు ఆరోపణలు వస్తే నిర్దాక్షిణ్యంగా అట్టివారిపై అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట శ్రీధర్, ఎస్సీ సెల్ కార్యదర్శి నూకతాటీ ఈశ్వరుడు, బిజెపి కూటమి నాయకులు,ఉపాధి హామీ పథకం అధికారులు, ఉపాధి కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలగట్టలేనివి.

**అమరులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సెన్లకు నివాళులు అర్పించిన ఆలమూరు,ఎస్సై జి నరేష్.**



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 21:**ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనవి, వారి కుటుంబాలకు యావత్ భారతదేశం తోడుగా ఉన్నామని తెలియజేసే మహత్తరమైన రోజే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవమని ఎస్సై జి నరేష్ అన్నారు.మంగళవారం స్థానిక స్టేషన్ వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్సై ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్మరణ స్థూపం చిత్రపటం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు ఎస్సై నరేష్, సిబ్బంది అమరవీరుల కుటుంబసభ్యులకు ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 1959వ సంవత్సరము అక్టోబరు 21వ తేదీ జమ్మూ కాశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో మనదేశ సరిహద్దు అయిన లడాక్ భూ భాగంలోకి చైనా దురాక్రమణకు పాల్పడిన సమయంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీర జవాన్లకు నివాళిగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టిన పోలీస్ సిబ్బందికి తమ ప్రగాఢ నివాళి అర్పిస్తున్నామన్నారు. దేశం కోసం పోలీసు అధికారులు చేసిన త్యాగాలు ఎప్పటికీ మరవలేనివని, వారు మన సమాజంలో ధైర్యం, సేవాభావం, నిబద్ధతలకు ప్రతీకలన్నారు. వారి కుటుంబాలకు మద్దతుగా, అండగా నిలబడటం మనందరి కర్తవ్యంగా భావించాలని, అదే వారిపట్ల మనం చూపగల అత్యున్నత నివాళిగా ఎస్సై నరేష్ పేర్కొన్నారు. అనంతరం ఇటీవల విధి నిర్వహణలో భాగంగా అమరులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్లకు నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో విస్తరించాలి



**కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:**పశుసంవర్ధక రంగం అభివృద్ధి రైతు ఆదాయాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో బలంగా విస్తరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ ప్రగతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి పశుసంవర్ధక శాఖ కార్యక్రమాల అమలు, మండలాల వారీగా సాధించిన పురోగతిని సమీక్షించి, అధికారులు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గోకులం షెడ్ల లక్ష్యాలను సాధించేందుకు రైతుల నుండి దరఖాస్తులు సేకరించి మంజూరు తీసుకోవాలన్నారు. బహు వార్షిక పశుగ్రాసాల లక్ష్యాలను సమయానికి సాధించాలని, కె పి ఐ ఆధారంగా ప్రతి మండలంలోని పురోగతిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంలో తెల్ల జాతి పశువుల ప్రాముఖ్యతను గుర్తించి, పశు ఆరోగ్య కార్యకర్తలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయం తో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం పై పశు ఆరోగ్య కార్యకర్తలకు పూర్తి శిక్షణ, మార్గదర్శకాలు నిరంతరం ఇవ్వాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం పై పశు ఆరోగ్య కార్యకర్తలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. టి. శ్రీనివాసరావు, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్లు డా. సుంకవల్లి సత్యనారాయణ (కొవ్వూరు), డా. మక్కెన వెంకటేశ్వరరావు (రాజమహేంద్రవరం), సబ్‌డివిజనల్ ఏరియా వెటెరినరీ హాస్పిటల్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ద్రాక్షారామంలో కార్తీకమాసం ఏర్పాట్లపై మంత్రి సుభాష్ సమీక్ష

**భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు**





**రామచంద్రపురం, పెన్ పవర్ అక్టోబర్ 21:**దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో జరగబోయే కార్తీకమాసం వేడుకల ఏర్పాట్లపై రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం అధికారు లతో సమీక్ష నిర్వహించారు.పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, దేవాదాయ, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా ఉండే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు ముందుగానే సమన్వయం తో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.“భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు అందించే ఏర్పాట్లు చేయాలి” అని మంత్రి ఆదేశించారు.అలాగే, ఎండ తీవ్రత దృష్ట్యా వాటర్‌ప్రూఫ్ టెంట్లు, భద్రతా చర్యలు,వైద్య సదుపా యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.గత సంవత్సరాల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని శాఖల సమన్వయంతో ఈసారి కార్తీకమాసం ఉత్సవాలను మరింత అనుభవపూర్వకంగా, ఘనంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రఘువీర్, దేవాలయ సహాయ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గా భవాని, ద్రాక్షారామం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి పార్టీ నాయకులు, అర్చకులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 21**: జగ్గంపేటలో అక్టోబర్ 31, నవంబర్ 1న భవన నిర్మాణ కార్మికుల కాకినాడ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(సిఐటియు)జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఇర్రిపాకలో మహాసభల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల మహాసభల్లో రానున్న మూడేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏవిధంగా పోరాడాలి, గడిచిన మూడేళ్లలో మనం చేసిన పోరాటాలు ఇవి మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల 25 లక్షల మంది కార్మికులు ఈ సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నారని, సంక్షేమ బోర్డు అమలు కాకుండా జగన్మోహన్ రెడ్డి అన్యాయంగా 1214 మెమో తీసుకొచ్చారని ఎటువంటి క్లైములు విడుదల కాకుండా అడ్డుకున్నారన్నారు. దీని ఫలితంగా 2024లో జగన్మోహన్ రెడ్డికి భవన నిర్మాణ కార్మికులు సమాధానం చెప్పడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీను అమలు చేయాలని సంక్షేమ బోర్డు పథకాలు అమలు కాకుండా అడ్డుపడిన జీ.ఓ నెం1214 మిమల్ని రద్దుచేసి పెండింగ్ క్లైములు, పరిహారాలు ఇవ్వాలని ఈ సందర్భంగా అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కాపాడుడం కోసం కార్మికులంతా అందరూ ఐక్యతతో ఉద్యమించాలని సందర్భంగా అన్నారు. ఈ మహాసభలపను జయప్రదం కోసం కార్మికులు, ప్రజలు ,ప్రజాప్రతినిధులు హార్దిక ఆర్థిక సహకారం అందించి జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట యూనియన్ నాయకులు కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, కెంగం బాబ్జి, అన్నవరం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టును ఢీకొన్న ఇన్నోవా బీఎస్ఎఫ్ జవాన్ మృతి,

**ఆరుగురికి తీవ్ర గాయాలు**





**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 21:**చింతూరు మండలంలోని కూనవరం వెళ్లే జంక్షన్ సమీపంలో గొర్లగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారి 30పై తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒరిస్సా రాష్ట్రం బలిమెలలోని బీఎస్ఎఫ్ 142 బెటాలియన్‌కు చెందిన ఏడుగురు జవాన్లు ఖమ్మం నుంచి బలిమెలకు ఇన్నోవా కారులో వెళ్తుండగా, చట్టి జంక్షన్ దగ్గరలోని కల్వర్టును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ గోమిటినగర్‌కు చెందిన జవాన్ గౌరవ్ కుమార్ పాండే (43) దురదృష్టవశాత్తు మృతిచెందగా, మరో ఆరుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ముందుగా చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 21**:పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని

ప్రస్తుత తరుణంలో పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని అఖిలపక్ష నాయకులు అన్నారు.మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు అఖిలపక్ష నాయకులు ర్యాలీ కొవ్వత్తుల నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలీసులు సమాజ రక్షకులని వారు లేకుంటే సమాజం అల్ల కల్లోలమవుతుందన్నారు. చైనా యుద్ధంలో గ్లాసియర్ ప్రాంతంలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించేందుకు పోలీసుల అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని చెప్పారు.పోలీసుల త్యాగాలు వెలకట్టలేవని ప్రతి ఒక్కరూ వారి త్యాగాలను కొనియాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.


# పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి -కలెక్టర్ షణ్మోహన్





**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 21:**విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు.పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) లతో కలిసి పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆర్మ్ రిజర్వ్ పోలీస్ దళం వందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ “1959 అక్టోబర్ 21న భారత్–చైనా సరిహద్దుల్లోని అక్సాయ్ చిన్ వద్ద సియాచిన్ ప్రాంతాన్ని ఆక్రమించేం దుకు ప్రయత్నించిన చైనా సైనికులను అడ్డుకునే క్రమంలో, డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలోని పంజాబ్ సీఆర్పీఎఫ్ 10 మంది ధైర్యవంతులైన పోలీసులు అమరులయ్యారు.వారి స్ఫూర్తి దాయకమైన త్యాగాన్ని స్మరించేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 21ను పోలీస్ అమర వీరుల దినోత్సవంగా పాటిస్తు న్నాము” అని తెలిపారు.దేశంలో శాంతి, భద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని కలెక్టర్ అభినందించారు.“ఏ ఆపద వచ్చినా ప్రజలకు మొదట గుర్తుకువచ్చేది పోలీసులే. మారుతున్న సమాజంలో కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు వారు శారీరకంగా, మానసికంగా సన్నద్ధంగా ఉండాలి” అని సూచించారు.తరువాత అడిషనల్ ఎస్పీ ఎస్. శ్రీనివాసరావు దేశం, రాష్ట్రంలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల పేర్లను చదివి వినిపించారు. దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు అమరులై ఉండగా, వీరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు ఉన్నారని తెలిపారు.పెరేడ్ కమాండర్ ఇన్స్పెక్టర్ ఎం.ఎన్. మూర్తి నేతృత్వంలో సాయుధ పోలీస్ దళం స్మృతి పెరేడ్ నిర్వహించింది. అనంతరం రెండునిమిషాలు మౌనం పాటించి అమరవీరులకు స్మరణాంజలి ఘటించారు.జిల్లాలో అమరులైన 14 మంది పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10,000 నగదు, పండ్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ అందజేశారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి, ప్రభుత్వ మద్దతు ఎల్లప్పుడూ తమకు ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పోలీసుల త్యాగస్ఫూర్తిని కొనియాడారు.కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.చివరిగా పోలీస్ అమరవీరుల స్మరణార్థం పోలీస్ కార్యాలయం నుండి భానుగుడి కూడలి వరకు ర్యాలీని కలెక్టర్, ఎస్పీ,ప్రజాప్రతి నిధులు జెండా ఊపి ప్రారంభించారు.

## లోకాయుక్త ఫిర్యాదును వెనుకకు తీసుకుంటున్నట్లు శారదా దేవి ప్రకటన



**వై రామవరం, పెన్ పవర్,అక్టోబర్ 21:** మండల కేంద్రమైన వైరామవరంలో గ్రామకంఠం భూములను గిరిజన, గిరిజనేతర్లు ఆక్రమణలకు పాల్పడ్డారని గతంలో వై.రామవరం గ్రామానికి చెందిన లండా శారదా దేవి లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.
ఈమె ఫిర్యాదు పై వై.రామవరంలో చాకలి వీధి నుండి మార్కెట్ వరకు 65 మంది ఆక్రమణదారులు ఉన్నారని ఆమె లోకాయుక్త కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మండల తహసిల్దార్, పంచాయతీ కార్యదర్శి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. 14 మంది ఇంజక్షన్ ఆర్డర్లు తీసుకురాగా, మిగిలిన వారు కూడా కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. అధికారుల ఆదేశాల మేరకు కొందరు స్వచ్ఛందంగా ఆక్రమణలనూ తొలగించడంతో ఫిర్యాదు దారురాలు సంతృప్తి చెందినట్లు, ఎవ్వరికీ ఎటువంటి అభ్యంతరకరం లేదని తాను ఫిర్యాదును వాపసు తీసుకుంటున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి వారికి లిఖితపూర్వకంగా తెలిపారని ఆక్రమణదారులు తెలిపారు.

## పోలీస్ స్మారక దినోత్సవం చింతూరులో ఘనంగా ర్యాలీ, మానవహార కార్యక్రమం





**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 21:**పోలీస్ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో పోలీస్ స్టేషన్ నుండి చింతూరు సెంటర్ వరకు విద్యార్థులు, సీఆర్పీఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తి, పోలీస్ సేవా త్యాగాల పట్ల గౌరవం కల్పించే ఉద్దేశ్యంతో ర్యాలీ నిర్వహించారని అధికారులు తెలిపారు. తరువాత చింతూరు సెంటర్ వద్ద మానవహార గొలుసు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు వీరమరణం పొందిన పోలీసు సిబ్బంది త్యాగాలను స్మరించుకున్నారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమర వీర పోలీసుల ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎస్సై చింతూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా పోలీసులు ప్రజా రక్షణలో, దేశ సేవలో తమ ప్రాణాలను సైతం అర్పించే త్యాగం గుర్తు చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

## మంత్రి వాసంశెట్టి సుభాష్ ఔదార్యం - మానవత్వానికి నిదర్శనం

- దేవాలయం అభివృద్ధికి రూ.50 వేలు, ఇద్దరికీ రూ.20 వేలు ఆర్థిక సహాయం



**రామచంద్రపురం, పెన్ పవర్, అక్టోబర్ 21:**రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన ఔదార్యాన్ని మరొకసారి చాటుకున్నారు. సామాజిక సేవా దృక్పథంతో ముందుండే నాయకుడిగా మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు.మంగళవారం రామచంద్రపురం పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సుభాష్, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగుడైన యనమదల కాశీను చూసి చలించిన మంత్రి, అతనికి రూ.10 వేల రూపాయల చెక్కును ఆర్థికసాయంగా అందజేసి తన సానుభూతిని వ్యక్తం చేశారు. తరువాత శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవాలయానికి దర్శనార్థం వచ్చిన మంత్రి, అక్కడి పూజారి దెందులూరి భద్రరాజు కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీశారు. భక్తులు ఇచ్చే విరాళాలతోనే జీవనోపాధి సాగిస్తున్నానని పూజారి వివరించగా, వెంటనే స్పందించిన మంత్రి సుభాష్ రూ.10 వేల రూపాయల చెక్కును ఆర్థికసాయంగా అందజేశారు.ఇదే సందర్భంలో కాపవరం గ్రామంలోని షిర్డీ సాయిబాబా దేవాలయ అభివృద్ధి కోసం రూ.50 వేల రూపాయల చెక్కును మంత్రి సుభాష్ అందజేశారు.మంత్రి సేవా దృక్పథం, సహృదయతను స్థానికులు ప్రశంసించారు. ప్రజలతో సాన్నిహితంగా మెలిగే నాయకుడిగా, కష్టకాలంలో అండగా నిలిచే మానవతావాదిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ గుర్తింపు పొందారని పలువురు అభిప్రాయపడ్డారు.

## తరలిపోతున్న అటవీ సంపద



- మితిమీరిపోతున్న అక్రమార్కుల ఆగడాలు
- కంచె చేనుమేస్తున్న వైనం
- కొందరు అటవీశాఖ అధికారులు చేతివాటం

**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 21:** ఇందుకూరు రేంజ్ పరిధిలోని అడవి ప్రాంతంలో వెదురు అక్రమ రవాణా దారులకు అడ్డుఅదుపులేకుండా పోతోంది. కొందరు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అక్రమార్కుల చేతులు కలపడంతోనే దట్టమైన అడవులు మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. కంచె చేను మేసిన చందంగా అధికారుల తీరు కనిపిస్తోంది. అక్రమ రవాణాను అరికట్టాల్సిన సంబంధిత అటవీ అధికారులు చోద్యం చూస్తూ ఉండటంతో లక్షలు విలువైన సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నారు.అటవీ సంపద అక్రమ వ్యాపారులకు ఇందుకూరు రేంజ్ రాజా మార్గంగా, మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది.అడవి ప్రాంతం నుంచి అటవీ సంపదను బొలెరో ట్రాక్టర్లతో వాహనాల్లో, అక్రమంగా తరలిస్తున్న అడ్డుకునే నాధుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా మానావాళిని కాపాడుతున్న పచ్చని చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. యథేచ్ఛగా అటవీ సంపద తరలిస్తున్నారు. అడవి విస్తరించి ఉండడంతో, ఏదో ఒక ప్రాంతం నుంచి అటవీ సంపద తరలిస్తూనే ఉంటారు.ఎంతో విలువైన అటవీ సంపదను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నా, పట్టించుకునే వారే లేరని స్థానికులు చర్చించుకుంటున్నారు. కేసులు నమోదు చేస్తున్నారో లేదో కానీ, అటవీ సంపద నరికివేత మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. ప్రతి రోజు పట్టపగలు రాత్రివేళల్లో ఇందుకూరు రేంజ్ నుండి సీతానగరం మండలంపురుషోత్తపట్నం వైపుకు రహదారి మార్గాల్లో అటవీ సంపద తరలుతోంది. చీకటి, పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. చేయి తడిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేనిపక్షంలో వేలకు వేలు అపరాధ రుసుం వేసి చేస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. విపరీతంగా అటవీ సంపద నరికివేయడంతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని, వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంటుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. అడవులు కనుమరుగు అవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అడవుల సంరక్షణ అనే కార్యక్రమాలు చేపడుతుంటే, మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా అటవీ సంపద నరుకుతూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది.ఇంటి దొంగలే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.అడిగినంత ఇస్తే అడిగే వారే లేరనట్లుగా అధికారుల తీరు మారింది. ఇక్కడ పనిచేసే కొంతమంది అధికారులు అవినీతిలో పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది.ఈ ప్రాంతంలో జన సంచారం పై పూర్తి గా నిషేధాజ్ఞలు ఉన్న అక్రమార్కులకు ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. యథేచ్ఛగా ఇందుకూరు రేంజ్ అడవి ప్రాంతంలో చొరబడుతున్న స్మగ్లర్లు అటవి సంపదను కొల్లగొట్టడంతో, పాటు వన్యప్రాణులకు ముప్పును తలపెడుతున్నారు. అయినా జిల్లా ఉన్నతాధికారులు నిస్సహాయత స్థితిలోనే కనిపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు, అవినీతి అధికారుల ఆగడాలకు అడ్డు లేకుండానే పోతోంది.అవినీతిలో ఆరితేరిన అక్రమార్కుల ఆగడాలు మితిమీరి పోతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. అడిగినంత ఇస్తే సరే, లేదంటే అక్రమార్కులను సైతం ముప్పుతిప్పలు పెడుతున్నట్లు చెబుతున్నారు. అందినకాడికి దండుకోవడం అటవీ శాఖ అధికారులకు అలవాటుగానే మారిందంటున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నత అధికారులు, అటవీ సంపద అక్రమార్కులపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.


### కాకినాడ నగర సమగ్ర అభివృద్ధికి

## సమగ్ర ప్రణాళికలు - కలెక్టర్ షణ్మోహన్

నవంబర్ 25 నాటికి ఖాళీ స్థలాలకు పన్నులు చెల్లించాలి -పార్కుల అభివృద్ధికి వ్యాపార సంస్థల భాగస్వామ్యం



**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 21:**కాకినాడ నగర సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సుస్థిరత మరియు పౌర సౌకర్యాల మెరుగుదల లక్ష్యంగా నగరాన్ని పరిశుభ్రంగా తీర్చి దిద్దడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేయడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళ వారం సాయంత్రం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణం, అభివృద్ధికి అనుకూలమైన అన్ని వనరులు కలిగిన కాకినాడ పట్టణాన్ని రాష్ట్రంలో ఆదర్శ పట్టణంగా తీర్చి దిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.“కాకినాడ నగరపాలక సంస్థ ఆదాయ వనరుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించి, రాబోయే మూడు నెలల్లో కీలక మార్పులు తీసుకురావడం జరుగుతుంది” అని ఆయన తెలిపారు. గత 2015%-%16 తర్వాత పన్నుల హేతుబద్ధీకరణ జరగలేదని పేర్కొని, రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లను ఆదర్శంగా తీసుకుని పన్ను విధానాలలో మార్పులు చేయనున్నట్లు వివరించారు. నవంబర్ 25 నాటికి ఖాళీ స్థలాలకు పన్నులు చెల్లించాలినగరంలో ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించకుండా ఉన్నారని పేర్కొని, నవంబర్ 25 నాటికి శాతం 100 పన్నులు చెల్లించాలని కలెక్టర్ హెచ్చరించారు.పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఖాళీ స్థలాలలో చెత్త పేరుకుపోయి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నందున, వాటిని పరిశుభ్రం చేసి కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.పార్కుల అభివృద్ధికి సామాజిక భాగస్వామ్యం కాకినాడ నగరంలోని పార్కులను ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని ప్రణాళిక ఉందని కలెక్టర్ తెలిపారు.మొదటి దశలో 9 ప్రధాన పార్కులను గుర్తించామని, వాటిని సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) కింద దత్తతకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఆ పార్కులు:వివేకానంద పార్క్, బోట్ క్లబ్ పార్క్, అన్నం ఘాటి పార్క్, సంత చెరువు పార్క్, జన్మభూమి పార్క్, సురేష్ నగర్ పార్క్, గాంధీనగర్ పార్క్, కెనాల్ బ్రాంచ్ పార్క్, అమరావతి పార్క్.పార్కుల అభివృద్ధికి వినూత్న ఆలోచనలతో ప్రతిపాదనలు సమర్పించే సంస్థలకు 15 రోజుల్లో అనుమతులు ఇవ్వనున్నట్లు కలెక్టర్ చెప్పారు.సురేష్ నగర్ పార్క్‌లో సువిశాల ఖాళీ ప్రదేశం, కన్వర్టబుల్ స్టేడియం వంటి వసతులు ఉన్నాయని, దీన్ని సద్వినియోగం చేసుకునేందుకు వ్యాపార, విద్యా, పారిశ్రామిక సంస్థలకు దీర్ఘకాల లీజు విధానం కింద ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈట్ స్ట్రీట్ల ఏర్పాటు ప్రణాళికకాకినాడ పట్టణంలోని రోడ్లపై బండ్లతో ఆహార పదార్థాల విక్రయాల వల్ల ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా ‘ఈట్ స్ట్రీట్‌లు’ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ పి. వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీ చరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# వాస్తవ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21:**భారతదేశంలోనే తొలి సారిగా నేతాజీ సారథ్యంలో సాధించుకున్న వాస్తవ స్వాతంత్ర్య దినోత్సవాన్ని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజమండ్రి లో జరుపుకుంటున్నందుకు సంతోషంగా వుందని , ఈ ఘటన చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఆన్నారు. అనంతరం భారతదేశం కోసం నేతాజీకి వెన్ను దన్నుగా నిలిచి ఆత్మ బలిదానానికి సిద్దపడిన యోధురాలు "నీరా ఆర్యా " ను , స్వాతంత్ర్యం . నేతాజీ ని స్ఫూర్తిగా తీసుకుని ఎందరో ఆత్మబలిదానాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం దినం 1943,అక్టోబర్ 21 తేది అని , ఈ రోజునే నేతాజీ సారథ్యంలో అధికారికంగా భారతీయ పాలన అధికారం లోకి వచ్చినదన్నారు. నేతాజీ పేరు బ్రిటిష్ వెన్నులో వణుకు పుట్టించిన కారణంగా ఆ నాటి కాంగ్రెస్ నేతలుగా వున్న గాంధీ – నెహ్రూ లే స్వాతంత్ర్యం భారతీయులకు రావటానికి కారణం అని బ్రిటిష్ వారి రికార్డులలో తప్పును ఒప్పుగా నమోదు చేయిం చారన్నారు. సాధించుకున్నటువంటి స్వాతంత్ర్యం ను విస్మరిస్తు గాంధీ – నెహ్రూ లు ప్రకటించిన స్వాతంత్ర్య దినం ను వేడుకగా జరుపుకుంటున్నారు. ప్రతి భారతీయుడు నేతాజీ సారథ్యంలో పూర్తి స్వేచ్చను సాధించుకున్న రోజు అక్టోబర్ 21 న స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవాలని , ప్రభుత్వం కూడా ఈ వాస్తవ వీరోచిత చరిత్రను గుర్తించి స్వాతంత్ర్య వేడుక దినంగా ప్రకటించాలన్నారు. ఈ వీరోచిత స్వాతంత్ర్య దినం 82 ఏళ్ల అనంతరం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి లో జరుపుకుంటున్న ఈ చారిత్రిక అంశం రాజకీయాలకు అతీతంగా స్వాతంత్ర్య దినంగా ఆచరించాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కోరారు. ప్రజల హృదయాల్లో నేటికి జీవించి ఉన్న నేత సుభాష్ చంద్ర బోస్ చరిత్రలో నేతాజీ తో పాటుగా ఎందరో దేశం కోసం ప్రాణాలు అర్పించి బ్రిటిష్ వాళ్ళను పారిపోయేలా చేసారన్నారు. ఆనాటి కాంగ్రెస్ కుట్రలతో పోరాట యోధుల చరిత్రను , వారి పేర్లను చరిత్ర పుటల్లో లేకుండా చేసారన్నారు. ఈ వేడుకలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ పెండ్యాల కామరాజు , కాసా రాజు , డి వి రమణమూర్తి , లంక దుర్గా ప్రసాద్ , బర్ల ప్రసాద్, ఎమ్ డి హుస్సేన్ , దుద్దే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , వాడపల్లి జ్యోతిష్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా , కొల్లి సత్యనారాయణ , ద్వాదశి శ్రీని వాస రావు, కాకర ప్రసాద్ , దోషి నిషాంత్ , వల్లి శ్రీనివాసరావు, యర్రా బాల మురళి కృష్ణ , చల్లా సాంబశివరావు , ఖండవల్లి శ్రీనివాసరావు , కూరాకుల నాగమణి , మీసాల హైమావతి , మాసా అప్పాయమ్మ, నాగూరు దుర్గ , వాసంశెట్టి శిరీషా తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమగ్ర సస్యరక్షణతో ఉద్యాన పంటలలో అధిక దిగుబడులు.





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 21:**ఉద్యాన పంటలలో సమగ్ర సస్యరక్షణతోపాటు మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడిలో సాధించవచ్చని రాజమండ్రి ఏరువాక పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ వెంకట నరసింహారావు ఉద్యాన పంటలలో పాటించవలసిన ఎరువుల యామాన్యం గురించి రైతులకు వివరించారు.ఉద్యాన పంటలు సాగు చేయటం ద్వారా రైతు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. అరటి లో వచ్చే దుంప పుచ్చు నివారణకు సూడోమోనాస్ శిలీంద్రాన్ని మొక్కకు 50 గ్రాములు చొప్పున వేసుకోవాలని తెలిపారు . రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు( బయో ఫర్టిలైజర్స్ ) వాడాలన్నారు.ఉద్యాన పంటలలో సర్పిలాకార తెల్ల దోమ నివారణకు వేప నూనె పిచికారీ చేయాలని తెలిపారు.

వరిలో వచ్చే చీడ పీడల నివారణ ,ఎరువుల యాజమాన్యం గురించి,రకాల ఎంపిక గుర్చి రైతులకు వున్న సందేహాలను నివృత్తి చేశారు.

ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ రాయితీ లను వివరించారు.తీగ జాతి కూరగాయలు సాగు చేసే రైతులు శాశ్వత పందిళ్లు వేస్కోటానికి ఎకరానికి లక్ష రూపాయలు రాయితీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు మొక్కలు 100% రాయితీ మరియు మొదటి నాలుగు సంవత్సరాలకు కలిపి ఎరువులు పురుగు మందులు నిమిత్తం ఎకరానికి 8400/ – ప్రభుత్వ రాయితీ అందిస్తుందని తెలిపారు.కొబ్బరి , ఆయిల్ పామ్ తోటలలో ,కోకో అంతర పంటగా సాగు చేయటానికి హెక్టారుకు 2 సంవత్సరాలకు కలిపి 30000 రూపాయల రాయితీ మొక్కలు,ఎరువుల నిమిత్తం ఉందని తెలిపారు.హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ నిమిత్తం 6 లక్షల రూపాయల ప్రభుత్వ రాయితీ రైతులకు అందిస్తుందని తెలియజేశారు.బిందు తుంపర సేద్యంలో ప్రభుత్వ రాయితీలను వివరించారు.

అనంతరం క్షేత్రస్థాయిలో కూరగాయల పంటలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు .ఈ కార్యక్రమంలో బూరుగుపూడి గ్రామ ఉప సర్పంచ్ పాటం శెట్టి కృష్ణ మూర్తి ,గ్రామ నాయకులు ఆశపు వీరభద్రరావు, , పాటంశెట్టి రవి,,కుంచె తాతాజీ,బాలిన వెంకటేశ్వరరావు,పాటంశెట్టి రమేష్,కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి పాలాటి నూకరాజు, గ్రామ ఉద్యాన సహాయకులు ఎం హరిత , గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ - ప్రజలకు డబుల్ బెనిఫిట్స్: ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**జీఎస్టీ 2.0 తో ఆర్థిక విసులుబాటు, వ్యాపారాభివృద్ధి**
**సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సులో వ్యాఖ్యలు**





**కాకినాడ, అక్టోబర్ 21 ,పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా ప్రజలకు డబుల్ బెనిఫిట్స్ అందుతున్నాయని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.మంగళవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా 33, 35, 40 డివిజన్‌లలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక విసులుబాటు కలుగుతోందని తెలిపారు.వ్యాపారులకు అమ్మకాలు పెరుగుతున్నాయని, ప్రజలకు నిత్యావసర వస్తువులపై పన్ను రహిత సదుపాయాలు కల్పించడం ద్వారా గణనీయమైన లాభం చేకూరుతోందని అన్నారు. కిరాణా సామాగ్రి, రోజువారీ అవసరాల వస్తువులు, ఆరోగ్యం %డ% జీవిత బీమా, దుస్తులు, పాదరక్షలు, మందులు, స్టేషనరీ వస్తువులపై పన్ను మినహాయింపు ఇవ్వడం ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని కలిగించిందని వివరించారు.డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే కేంద్రం, రాష్ట్రం కలసి పనిచేయడం ద్వారా అభివృద్ధి వేగం రెట్టింపవుతుందని కొండబాబు తెలిపారు. ఈ విధానం ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు డబుల్ లాభాలు అందిస్తున్నదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, బచ్చు శేఖర్, ఎస్ కె రహీమ్,గదుల సాయిబాబా, గుజ్జు దుర్గ లక్ష్మణరావు, పసుపులేటి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి బూరయ్య, అట్ల సత్యనారాయణ, ముత్యాల రాణి, విస్సంసెట్టి బాబ్జి, నాదెళ్ల నరసింహారావు, గోకరకొండ చిట్టిబాబు, మనోహర్ గుప్తా, మద్దూరి బాలకృష్ణ, సత్తిబాబు, సరగడ వెంకటరమణ, అబ్దుల్ రహీమ్ ఖురేషి, సత్తిరాజు వెంకటరత్నం, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి మండల అధ్యక్షులుగా గెలుపొందిన యడవల్లిని సన్మానించిన మీడియా మిత్రులు



**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్ 21.**తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పోటి కూనవరం మండల కేంద్రంలో నువ్వా నేనా అన్నట్లుగా నెలకొన్న ఉత్కంఠ ఫలితాలలో గెలుపు యడవల్లి భాస్కరరావు ను వరించింది.నూతన టిడిపి మండల అధ్యక్షులుగా ఎన్నికయ్యాన భాస్కరరావు ను కూనవరం మీడియా మిత్రుల అధ్వర్యంలో ఘనంగా దుస్సాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో యాలం సీతారామయ్య,ఆంధ్రజ్యోతి కృష్ణ,భాష,వల్లాల సత్యనారాయణ, పరిటాల వెంకట్,మచ్చ వినయ్ ప్రసాద్,టిడిపి నాయకులు పోడియం అప్పారావు,చెలికాని ఉమా,పారి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ శవ రాజకీయాలు చేయడం మానుకోవాలి

- జనసేన తడాఖా చూపిస్తాం
- జనసేన నగర అధ్యక్షుడు అత్తి (అనుశ్రీ)సత్యనారాయణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 21**

నెల్లూరు జిల్లా, కందుకూరు గ్రామంలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్య ను వైసీపీ నేతలు శవ రాజకీయాలు చేసి ప్రజల్లో కులాల చిచ్చు రేపుతున్నారని జనసేన నగర అధ్యక్షుడు అత్తి (అనుశ్రీ)సత్యనారాయణ

ఆగ్రహం వ్యక్తం చేసారు. స్థానిక జనసేన నగర పార్టీ కార్యాలయంలో మంగళవారం జనసేన నగర అధ్యక్షుడు జనసేన నగర అధ్యక్షుడు అత్తి (అనుశ్రీ)సత్యనారాయణ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అనుశ్రీ మాట్లాడుతూ ,

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం పథకాలు అందుతున్నాయని, రాష్ట్రం ప్రశాంతంగా ఉండడం వైసిపి అధినేత జగన్ కు, ఆ పార్టీ నాయకులు సహించలేక పోతున్నారని , దాంతో కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరు సంఘటన ను ఖండిస్తున్నామని, రాష్ట్ర మంత్రులు, కూటమి నాయకులు బాధిత కుటుంబాన్నీ అడ్డం పెట్టుకొని వైసిపి స్వార్థ రాజకీయాలు చేస్తే జనసేన చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. గత ఐదేళ్ల పాలన లో ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు సంబరాల రాంబాబు గా ఉన్నారన్నారు. .

కందుకూరులో వ్యక్తిగత కక్షలతో హత్య జరిగిందని దాన్ని వైసిపి కులాలతో ముడిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని వైసిపి నేత జగన్, అతని వర్గీయులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సంఘటనను రాష్ట్ర ప్రజల్లో తప్పుదోవ పట్టించేందుకు సంబరాల రాంబాబు, ఈ సంఘటనను శవ రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. జక్కంపూడి రాజా, నరేంద్ర లు కుల రాజకీయాలు చేస్తే జనసేన చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

## అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

**కమాండెంట్ ముద్రగడ నాగేంద్ర**

**ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా**


**స్మృతి పెరేడ్ నిర్వహించిన సిబ్బంది – కుటుంబాలకు జ్ఞాపికలు అందజేత**





**కాకినాడ రూరల్, అక్టోబర్ 21 పెన్ పవర్:**విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్ ముద్రగడ నాగేంద్ర అన్నారు. రమణయ్యపేట పరిధిలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ ప్రధాన కార్యాల యంలో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కమాండెంట్ ముద్రగడ నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం పోలీస్ సిబ్బంది స్మృతి పెరేడ్ నిర్వహించారు.తరువాత అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేసి,వారి త్యాగాలను గుర్తుచేశారు.ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ, ఈ బెటాలియన్‌కు చెందిన 16 మంది ధీరజవాన్లు విధి నిర్వర్తనలో అమరులయ్యారని తెలిపారు. భారత–చైనా సరిహద్దు వద్ద 1959 అక్టోబర్ 21న పంజాబ్ డి.ఎస్.పి. కరమ్‌సింగ్ నేతృత్వం లోని పిఆర్‌పిఎఫ్ బృందం గస్తీ నిర్వహిస్తున్న సమయంలో చైనా సైన్యం ఆక్రమణకు దిగిందని, ఆ సమయంలో దేశ రక్షణలో 10 మంది సిబ్బంది వీరమరణం పొందారని గుర్తు చేశారు.ఆ సంఘటన స్మరణార్థం దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తు న్నామని వివరించారు.ఇంచార్జ్ అడిషనల్ కమాండెంట్ బి. మురళీ కుమార్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం సిబ్బంది రెండు నిమిషాల మౌన వ్రతం పాటించి నివాళు లు అర్పించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు గంగరాజు, చంద్రశేఖర్, మన్మథరావు, ఆర్‌ఐలు అజయ్‌కుమార్,మురళీమోహనరావు, ప్రసాద్, హరిబాబు, రాము, ఆర్‌ఎస్‌ఐలు రామశేష తదితరులు, బెటాలియన్, స్కూల్, హాస్పిటల్ సిబ్బంది, రిటైర్డ్ పోలీస్‌లు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తకోట పాఠశాల భవనం ప్రమాద స్థితి - కొత్త భవనం కోసం గ్రామస్థుల విజ్ఞప్తి.



**కె గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 21:**కె. గంగవరం మండలం కొత్తకోట గ్రామంలోని ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల భవనం తీవ్ర జీర్ణావస్థకు చేరుకుంది. 1993లో నిర్మించిన ఈ భవన స్లాబ్ పూర్తిగా పాడై తరచూ నీరు చిందుతూ ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.ఒకటి నుండి ఐదో తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్న ఈ భవనంలో వర్షాకాలంలో గదుల లోపలకే నీరు చేరిపోవడంతో విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**భీమవరం మార్కెట్ యార్డులో స్మృతి పోలీస్ పరేడ్ - ప్రధాన అతిథిగా హాజరైన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ**





**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ భీమవరం, అక్టోబర్ 21 :** దేశ అంతర్గత శాంతి, భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న జరుపుకునే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భీమవరం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రధాన అతిథిగా హాజరయ్యారు.

గౌరవ అతిథులుగా రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు , కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముందుగా పోలీసు అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సాయుధ దళాల గౌరవ వందనం మధ్య మౌనం పాటించి వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

"పోలీసులు దేశానికి అంతర్గత సైనికులు" – కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఈ సందర్భంగా మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ...

దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తారని, శాంతిభద్రతల నిర్వహణ, సంఘవిద్రోహ శక్తుల అణచివేత, ఎన్నికల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

భారత సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని కాపాడితే, అంతర్గత శాంతి భద్రతలను పరిరక్షించేది పోలీసులు అని ఆయన గుర్తు చేశారు.

"పోలీసు వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోతే ఏ ప్రభుత్వ వ్యవస్థ కూడా సవ్యంగా నడవదు. రాత్రింబవళ్లు విరామం లేకుండా ప్రజల భద్రత కోసం పనిచేసేది ఈ వ్యవస్థే," అని మంత్రి ఉద్ఘాటించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరిహద్దు సైనికులతో దీపావళి జరుపుకోవడం వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే కాకుండా, వారి సేవలకు గౌరవ సూచకమని అన్నారు.

అదేవిధంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కూడా పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలకు భరోసా ఇవ్వడానికి ఒక సంకేతమని పేర్కొన్నారు.

పోలీసుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు.

"అమరవీరుల త్యాగాలు మాకు ప్రేరణ" – జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి,

జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ

1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా దళాలతో జరిగిన పోరులో వీరమరణం పొందిన 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల స్ఫూర్తితో ఈ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా పాటిస్తున్నామని గుర్తుచేశారు.

అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది ం డీఎస్పీ ఎం. చక్రధరరావు,ఎస్సై ఎ.జి.ఎస్. మూర్తి, పీసీ 1216 సి.హెచ్. వెంకటేశ్వరరావు, పీసీ 1415 పి. శ్రీహరి, పీసీ 450 జి. సురేంద్రనాథ్, జెసి 6674 పి. సుధీర్ బాబు (గ్రేహౌండ్స్), జెసి 7167 కె. మనోజ్ కుమార్ (గ్రేహౌండ్స్) తో పాటు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన 191 మంది పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు.

"అమరుల త్యాగాలు మా అంకితభావానికి పునాది. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం," అని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం. సత్యనారాయణ, భీమవరం డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, తాడేపల్లి గూడెం డీఎస్పీ డి. విశ్వనాథ్, ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, డి. వెంకటేశ్వరరావు, కె. వెంకట్రావు, మహిళా ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీమతి ఇందుమతి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. మోజేష్, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## తణుకులో పరిశుద్ధ కార్మికుల సమ్మె

**తక్కువ వేతనాలు, నెల నెలా జాప్యంతో చెల్లింపులపై ఆవేదన**



**తణుకు, పెన్ పవర్ అక్టోబర్ 21 :** పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ మంగళవారం నుంచి సమ్మెలోకి దిగారు.

ఈ సమ్మెను ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టారు. ఆసుపత్రిలో రోజూ శ్రమిస్తున్నప్పటికీ తగిన వేతనాలు ఇవ్వకపోవడం, ప్రతి నెలా జాప్యంతో చెల్లింపులు జరగడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

"మేము పస్తులతో విధులు నిర్వహించాల్సి వస్తోంది. కనీస వేతనాలూ సమయానికి రావడం లేదు. కుటుంబాలను పోషించుకోవడం కష్టమైపోతోంది," అని కార్మికులు వెల్లడించారు.

కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని యూనియన్ నేతలు హెచ్చరించారు.

## ప్రభుత్వానికి సవతి తల్లి ప్రేమ కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మీద ఎందుకు...




**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్ 21.** మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులకు పండగ కానుకలుగా టి ఏ అండ్ డి ఏ,లను ప్రకటించడం మంచి శుభ తరుణమే.ప్రభుత్వ సంస్థలలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి జీతాలు పెంచడం లేదు.ఆ విషయం ప్రభుత్వానికి ఎందుకు గుర్తుకు రావడం లేదని ప్రభుత్వానికి ప్రశ్నించారు.10వేలునుండి 20 వేల జీతంతో ప్రజలకు సేవలు అందిస్తున్న ఉద్యోగుల మీద ప్రభుత్వం సవితి ప్రేమ ఎందుకు చూపిస్తుందని అన్నారు.సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పిన ఎందుకు అమలు చెయ్యడం లేదని ప్రశ్నించారు.కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగం ఉందనే పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన చెందారు.ఉద్యోగాలను పర్మినెంట్ చేయడానికి అవకాశం ఉన్న వారందరిని వెంటనే రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు,ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో టి నాగేష్,పి దేవి ప్రసన్న కుమారి,కె రమేష్,యం తులసి,డి దిలీప్ కుమార్,టి అఖిల్,కె రాజు,బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.ం

## దేశభక్తి ,మహిళా శక్తి కలయికగా 50,000 చేతితో కుట్టిన జాతీయ జెండాల ప్రాజెక్ట్

- 80 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని
- పురస్కరించుకుని గిన్నిస్ రికార్డు లక్ష్యంగా మహిళా మనోవికాస్ సంస్థ




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 21:** దేశభక్తి జ్వాలను మహిళా శక్తితో మేళవిస్తూ విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న మహిళా మనోవికాస్ సంస్థ కొత్త గిన్నిస్ రికార్డు సృష్టించేం దుకు అడుగులు వేస్తోంది. సంస్థ వ్యవస్థాపకురాలు సూరిభట్ల మాధవి ఆగస్టు 2026లో జరగనున్న భారత స్వాతంత్ర్య 80 వ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని 50,000 చేతితో త యారు చేసిన జాతీయ జెండాలను రూపొందించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ తిరంగ' ప్రచార స్ఫూర్తితో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా మాధవి, సంస్థ సభ్యురాలు చల్లా మంజుతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ని కలిశారు. స్వయంగా మహిళలు కుట్టిన త్రివర్ణ పతాకాన్ని కలెక్టర్‌కు ప్రదర్శించారు.ప్రస్తుతం 250 మందికి పైగా మహిళలు ఈ జెండాల తయారీలో నిమగ్నమై ఉన్నారని మాధవి తెలిపారు. 2026 ఆగస్టు 15 నాటికి ఈ జెండాలను పాఠశాలలు, కళాశాల లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.ఇది కేవలం ఒక రికార్డు కాదు దేశానికి మహిళల నుండి ఒక గౌరవనివాళి అని ఆమె పేర్కొన్నారు. 50,000 చేతితో తయారు చేసిన జెండాల ప్రాజెక్ట్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కు సమర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది గిన్నిస్ రికార్డులు సాధించిన మాధవి కి ఇది తొమ్మిదవ రికార్డు ప్రయత్నం కానుంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ మహిళల్లో ఆత్మవిశ్వాసం, స్వా వలంబన, దేశభక్తిని పెంపొందించే అద్భుత కార్యక్రమం ఇది. ప్రధానమంత్రి దృష్టిలోని మ హిళా సాధికారత భావనతో ఈ ప్రాజెక్ట్ సమపా ళ్లలో ఉంది, అని ప్రశంసించారు.

మహిళా మనోవికాస్ సంస్థ చేపట్టిన ఈ కార్య క్రమం దేశభక్తి, మహిళా సాధికారత, సృజ నాత్మకతలకు ప్రతీకగా నిలుస్తోంది. మహిళల చేతుల్లోనుంచి అల్లబడుతున్న ఈ త్రివర్ణాలు భారత జాతి గౌరవానికి కొత్త చరిత్రను సృష్టించే దిశగా ముందడుగు వేస్తున్నాయి.

# కొయ్యూరు జడ్పిటిసి వారా నూకరాజు దారుణ హత్య





### ఖండించిన పలువురు వైసీపీ నేతలు

**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 21:** ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్, ప్రస్తుత కొయ్యూరు జెడ్పిటిసి వారా నూకరాజు దారుణ హత్యకు గురయ్యారు. భూతగాదాలే జడ్పిటిసి నూకరాజు హత్యకు దారి తీసినట్టు తెలుస్తోంది. మండలంలోని చిట్టింపాడుకు చెందిన వార నూకరాజుకు, రోలుగుంట మండలం, చటర్జీ పురానికి చెందిన కొంతమంది ఆదివాసీలకు మధ్య ఎంకేపట్నం రెవిన్యూ గ్రామం పరిధిలోని సర్వేనెంబర్ 139 లోని గల పది ఎకరాల సాగు భూమికి సంబంధించి గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఆ భూమిని తాను కొనుగోలు చేశానంటూ, తన పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయంటూ జెడ్పిటిసి వారా నూకరాజు వాదన కాగా, ఆ భూమిలో తాము ఏళ్ల తరబడి సాగులో ఉన్నామంటూ చటర్జీపురానికి చెందిన ఆదివాసీల వాదన. ఈ విషయమై ఇరు వర్గాలు ఒకరి తరువాత ఒకరు కోర్టులను ఆశ్రయించగా ప్రస్తుతం కోర్టులో వాదనలు నడుస్తున్నాయి. అయితే ఇటీవల పలుమార్లు జడ్పిటిసి వారా నూకరాజు వివాదాస్పద భూమిలోనికి వెళ్లడం, ఆదివాసీలు వాదనకు దిగడం జరుగుతూ వస్తోంది. ఇందులో భాగంగా ఒక దఫా ఇరు వర్గాల మధ్య కొట్లాట చోటుచేసుకుని, నూకరాజు తీవ్ర గాయాల పాలైన సంఘటన కూడా ఉంది. అయితే ఇటీవల మరలా వారా నూకరాజు ఆ భూమిలోనికి ప్రవేశించి ఆదివాసీలకు చెందిన గుడిసెలు దగ్ధం చేసి, అరటి తోటను ధ్వంసం చేసినట్టు ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో జెడ్పిటిసి నూకరాజు దీపావళి రోజు సోమవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆ భూమిలోనికి ప్రవేశించడంతో కొంతమంది గుర్తు తెలియని ఆదివాసీలు ఒక్కసారిగా ఆగ్రహానికి గురై నూకరాజుపై కత్తులతో దాడి చేయడంతో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందారు. దీనితో రోలుగుంట పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోమవారం సాయంత్రం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే బాధిత కుటుంబీకులు, వైసీపీ నేతలు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగి ధర్నా చేయడంతో ఆసుపత్రి వద్ద గందరగోళం చోటుచేసుకుంది. రంగంలోకి దిగిన పోలీసులు బాధితులను సముదాయించి, పోస్టుమార్టం జరిపించగా, అటుపై మృతదేహాన్ని నూకరాజు కుటుంబీకులు స్వగ్రామమైన చిట్టింపాడు తరలించి అంత్యక్రియలు జరిపించారు. నూకరాజు మృతదేహాన్ని వైసిపి నేత రాష్ట్ర మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, మాజీ ఎమ్మెల్యేలు కొ ట్టగుల్లి భాగ్యలక్ష్మి, పెట్ల ఉమా శంకర్ గణేష్, శెట్టి పాల్గుణ, ఎంపీపీ బడుగు రమేష్ బాబు, చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, వైసీపీ నేతలు కే శివప్రసాద్, జల్లి బాబులు, బొబ్బిలి లక్ష్మణ్, గాడి సత్యనారాయణ, బండి సుధాకర్, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ పలువురు నేతలు వైసిపి శ్రేణులు పరామర్శించి ఘన నివాళులు అర్పించారు.

### హత్యలతో సమస్యలు పరిష్కారం కావు: వైసీపీ నేతలు

ఇదిలా ఉండగా హత్యలతో భూ సమస్యలు పరిష్కారం కావని, కోర్టుల ద్వారానే పరిష్కరించుకోవాలని వైసీపీ నేతలు మాజీ మంత్రి అమర్నాథ్, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీపీ బడుగు రమేష్ బాబు తదితరులు వేరువేరు ప్రకటనల ద్వారా అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు లోపించాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఇప్పటికైనా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.





# భాగస్వామ్య సదస్సు సిద్ధతలపై కలెక్టర్ సమీక్ష





- విశాఖ ప్రతిష్ఠకు ప్రతిబింబంగా చేయాలి
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**విశాఖ దక్షిణం పెన్ పవర్, అక్టోబర్ 21:**నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించబోయే భాగస్వామ్య సదస్సు కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పటిష్ఠ ఏర్పా ట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ కె. మయూర్ అశోక్, సీఐఐ ప్రతినిధులు, నిర్వాహకులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చిన ఆయన, ప్రతి విభాగం తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.
కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సదస్సు విశాఖ ప్రతి ష్ఠకు ప్రతిబింబం కానుంది. చిన్నపాటి లోపాల కూ చోటు ఇవ్వకూడదు. ప్రతి విభాగం ముం దస్తు చర్యలు తీసుకుని పూర్తి సమన్వయంతో పనిచేయాలి," అని పేర్కొన్నారు.ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానాన్ని కార్యక్రమ వేదికగా గుర్తించినట్లు తెలిపారు. బుధవారం నుంచే మైదానం లెవెలింగ్ పనులు ప్రారంభించా లని, చిన్న రాళ్లను తొలగించాలని ఆదేశించారు. జీవీఎంసీ, హార్టికల్చర్ శాఖలతో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని, సుందరంగా అలంకరణ లు, పెయింటింగులు చేయాలని సూచించారు.
వీ.ఐ.పీ.లకు ప్రత్యేక సదుపాయాలు
వీఐపీలు, విదేశీ అతిథుల రాక కోసం ప్రత్యేక పార్కింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను స్పష్టంగా గుర్తించాలని ఆయన సూచించారు. అలాగే తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, పారిశుద్ధ్య చర్యలు ముందుగానే సిద్ధం చేయాలని సంబంధిత విభాగాలపై బాధ్యత వేశారు.ఆరోగ్య, భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి డీఎం%డ%హెచ్వోకు ఏయూ మైదానంలో అంబులెన్స్, వైద్య సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉంచాలని, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులకు ఫైర్ సేఫ్టీ తనిఖీలు పూర్తిచేసి అవసరమైన అగ్నిమాపక పరికరాలను సిద్ధం చేయాలని సూచించారు.
సదస్సు ప్రమాణాల ప్రకారం ఏర్పాట్లు
ఏయూ ప్రాంగణంలోని డ్రెయిన్లను శుభ్రపరచి మైనర్ రిపేర్లు చేయాలని, విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి రానున్న ప్రతినిధుల కోసం హోటల్ గదులు, హోమ్ స్టే సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు.
ఆర్ %డ% బి శాఖ అధికారులు ప్రధాన వేదికల భద్రతా ప్రమాణాలు పరిశీలించి ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచిస్తూ, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తే భాగస్వా మ్య సదస్సు విశాఖ ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్తుందన్నారు.

## ఓపెన్ స్పేస్‌లపై ఆక్రమణలకు చెక్

- జీ.వీ.ఎం.సీ.కి గంటా హెచ్చరిక



**బిమిలి, పెన్ పవర్, అక్టోబర్ 21 :**జీవీఎంసీ పరిధిలోని వార్డుల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికను త్వరితగతిన సిద్ధం చేయా లని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.మంగళవారం ఎం.వీ.పీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో మధురవాడ, భీమిలి జోనల్ కమిషనర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, కళ్యాణమండ పాలు, హౌసింగ్, ఈట్‌స్ట్రీట్ వంటి పౌరసదు పాయాల పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, కమిషనర్ కేతన్ గార్గ్ సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు.ఎండాడ మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్ వ్యాపారుల కోసం ప్రతిపాదించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయా లని ఆదేశించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించబోయే "ఈట్ స్ట్రీట్"ను సాగర్‌నగర్ పరిసరాల్లో ఏర్పాటు చేస్తే ఎక్కువమందికి అందుబాటులో ఉంటుందని అభిప్రాయపడ్డారు. చిల్లపేట చెరువు రిటైనింగ్ వాల్ నిర్మాణం, భీమిలి%-%తగరపువలస మెయిన్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలపై అధికారులు వివరించారు. భీమిలి క్లాక్‌టవర్ నమూనాను త్వరగా సిద్ధం చేయాలని సూచించారు.జీవీఎంసీ పరిధిలోని ఓపెన్ స్పేస్‌లపై జరుగుతున్న ఆక్రమణలపై గంటా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూములను కాపాడేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మొత్తం 149 ఓపెన్ స్పేస్‌లలో ఆక్రమణలు ఉన్నవాటిని తొలగిం చేందుకు చర్యలు ప్రారంభించాలని సూచించారు.ఇప్పటికే 24 పార్కులు అభివృద్ధి చేయగా, ఇంకా 25 పార్కులు అభివృద్ధి దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. దీనిపై గంటా స్పందిస్తూ ,గతంలో వైసీపీ నాయకుల అధీనంలో ఉన్న వైభవ్ నగర్ పార్కులను తిరిగి ప్రజలకే అప్పగించామని, వాటిలో అభివృద్ధి పనులు సమీక్షిస్తున్నామని తెలిపారు. స్థానిక సంఘాలు బాధ్యత తీసుకుంటే పార్కులు మెరుగ్గా అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు.
పార్కుల అభివృద్ధి కోసం 2వ, 4వ వార్డులను ప్రాధాన్యంగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, అయ్యప్పనాయుడు, ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఘటాల ఉత్సవంలో సిరమ్మ ప్రత్యేక పూజలు



- పైడితల్లి అమ్మవారి చల్లదనంలో
- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు



**బిమిలి, పెన్ పవర్, అక్టోబర్ 21 :**విజయనగరం అశోక్‌నగర్ ప్రాంతంలో మంగ ళవారం నిర్వహించిన శ్రీ పైడితల్లి అమ్మవారి ఘటాలు మరియు చల్లదనం కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కుమార్తె అయిన సిరమ్మ, కమిటీ సభ్యుల ఆహ్వానంపై ఘటోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఘోషా ఆసుపత్రి సమీపంలోని అమ్మవారి చదునులో శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.
వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్న ఆమె, అమ్మవారి కరుణ కటాక్షాలు సమస్త భక్తులపై ప్రసరించాలని ప్రార్థించారు. అనంతరం భక్తుల కు స్వయంగా ప్రసాదం వితరణ చేశారు.
ఈ సందర్భంగా స్థానికులు సిరమ్మకు ఘనస్వా గతం పలికి, ఆమె భక్తిశ్రద్ధలను ప్రశంసించారు.
పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని మనసారా కోరుకుంటున్నాను,అని సిరమ్మ ఈ సందర్భంగా తెలిపారు.

## పేదలకు అండగా శ్రీమన్నారాయణ నిరాశ్రయుల ఆశ్రమం

కాంగ్రేగుల గాంధీ, కోయిలడ శంకర్రావు, కనకరాజు, ఆనంద్ కు సత్కారాలు.



**కూర్మన్నపాలెం : పెన్ పవర్, అక్టోబర్ 21**
విశాఖ జిల్లా గొల్లలపాలెం తిరుమల నగర్ లో స్వామి వివేకానంద మదర్ దేరిసా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణ నిరాశయుల ఆశ్రమం పనులు వేగంగా పూర్తవుతున్నాయి. కోయిలాడ శ్రీనివాసరావు అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కి అండగా నిలబడిన ప్రముఖులు కాంగ్రేగుల గాంధీ, కోయిలాడ శంకర్రావు,చిరంజీవి అభిమానులు బొంతు కనకరాజుకి, పిఎస్ ఆనంద్ కి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు, ప్రముఖులు అందరూ సహకరించడంతో ఈ రోజు స్వామి వివేకానంద, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ నిర్మాణం పనులు చాలా వేగంగా పూర్తవుతున్నాయని తెలిపారు. త్వరలో శ్రీమన్నారాయణ నిరాశయుల ఆశ్రమం నిత్యం సనాతన ధర్మాన్ని బోధిస్తూ పేద ప్రజలకు,అనాధలకు అండగా నిలబడుతుందని తెలిపారు.
ఈరోజు మాకు సహకరించిన కాంగ్రేగుల గాంధీ, కోయిలాడ శంకర్రావు,చిరంజీవి అభిమానులు కనకరాజు, ఆనంద్ ఎన్నో ఏళ్ల నుంచి ఆలయాలకు, తమ పుట్టిన గ్రామాలకి ఉన్న ప్రాంతాలకు ఎన్నో సేవలందిస్తున్నారని, ఇటువంటి ప్రముఖులు మాకు అండగా నిలబడడం శుభపరిణామని తెలిపారు. ఈ రోజు తిరుమల నగర్ వెంచర్ ఓనర్స్ శ్రీనివాసరావు , దాము, చిరంజీవి వర్మ ట్రస్ట్ సభ్యులు విద్యుత్ ఏర్పాటు, ఆశ్రమం నిర్మాణం పనులను పరిశీలించామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సోమయాజుల కనక లింగేశ్వరరావు, వైస్ చైర్మన్ పెన్మెత్స ఆదినారాయణ రాజు, డైరెక్టర్ దాసరి బుజ్జి, కో ఆర్డినేటర్స్ కోమారా ప్రదీప్ కుమార్, సూరిశెట్టి జోగినాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కునగరం లో అమృతరావుకు ఘన నివాళి



**కూర్మన్నపాలెం : పెన్ పవర్ ,అక్టోబర్ 21**
ఉక్కు కర్మాగారం కోసం 21రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి విశాఖ ఉక్కు కర్మాగారం వస్తే తెలుగు వారికి ఉద్యోగాలొస్తాయని ప్రాణాలకు సైతం లెక్కచేయలేని ఉక్కు సాధకులు ,ఉక్కు సత్యాగ్రహి,సుభాష్ చంద్రబోస్ తో పాటుగా సైన్యంలో పనిచేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ,గుంటూరు మాజీ శాసనసభ్యుడు తమనం పల్లి అమృతరావు 105వ జయంతి వేడుకను స్టీల్ ప్లాంట్ అమృతరావు పార్కులో ఘనంగా నిర్వహించారు.నిర్వహణ కమిటీ చైర్మన్ ఎవి రమణారావు వైస్ చైర్మన్ జెర్రిపోతుల మోహన్ కుమార్ నిర్వహణ లో జరిగిన జయంతి వేడుకలకు
గాజువాక మాజీ ఎంఎల్ఏ చింతలపూడి వెంకటరామయ్య, వైఎంసిటీ చైర్మన్ వై వరలక్ష్మి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు .
కార్యక్రమం లో ప్రథమం గా చింతలపూడి వెంకటరామయ్య మరియు కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉక్కు పోరాటంలో చనిపోయిన 32మంది అమరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
ఈసందర్భంగా చింతలపూడి వెంకటరమణ మాట్లాడుతూ,
స్టీల్ ప్లాంట్ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఎన్నో ఉద్యమాలు చేసి కార్మికుల కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అవ్వకుండా ఉండడం కోసం మేమంతా ఎంత దూరమైనా పోరాడుతామని తెలియజేస్తున్నానన్నారు. స్టీల్ ప్లాంట్ కి నిధులు కేటాయించామని చెబుతూనే ప్లాంట్ అవసరాలకు కేటాయించకుండా భారం మోపుతున్నారని, విఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను సాగనంపుతు, మరో పక్క వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తున్నారని ,ఇది చాలా అన్యాయమన్నారు. మన రాష్ట్రంతో పాటు పక్కరాష్ట్రాలలో వున్న ఇతర ఉక్కు కర్మాగారాల ప్రైవేటీకరణ ఆపి ,వాటి అభివృద్ధికి నిధులు కేటాయించుకున్నారని, కానీ మన రాష్ట్రంలో ఎండిఏ ప్రభుత్వం అధికారంలో వున్నా సరే ఇప్పటికీ ప్రైవేటీకరణ ఆపేసామనే స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించలేదని, ఓవైపు వివిధ విభాగాల ప్రైవేటీకరణతో పూర్తి స్థాయి ప్రైవేటీకరణకు ద్వారాలు తెరిచారని అన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు తెలుగు వారిగా ఉద్యమాలతో ఉక్కు పాదం మోపుతామని ఈ సందర్భంగా తెలియజేసారు.
ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలన వచ్చిన తర్వాత ఇప్పటికీ 9 లక్షల కోట్లు ఇతర ప్రైవేట్ బిజినెస్ మాన్ లకు రుణాలు రద్దు చేశారని, స్టీల్ ప్లాంట్ కున్న ఇరవై వేల కోట్లు అప్పుని రద్దు చేయకుండా గనులు కేటాయించకుండా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడానికి ఎందుకంత మొగ్గు చూపిస్తున్నారో అర్థం కాని పరిస్థితని,ఎనిమిది లక్షల కోట్లు విలువచేసే స్టీల్ ప్లాంట్ భూములను ప్రైవేటీకరణ చేస్తున్నారా లేక ఇరవైవేల కోట్లు అప్పు ఉన్నాయని స్టీల్ ప్లాంట్ ని అమ్మేస్తున్నారన్న విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఉక్కు చరిత్రలో అమృతరావు ప్రతీ అణువునా వుంటారని, నేడు కర్మాగారంను బ్రతికించాలంటే 5సం ల పాటు అప్పును పెట్టుబడిగా చూపితే తనంతట తానే పుంజుకుంటుందని అన్నారు.
అమృతరావు స్ఫూర్తితో కర్మాగారం కాపాడుకోవాలని, విశాఖ ఉక్కును సెయిల్ లో మెర్జ్ చేయాలని లేదా సొంత గనులు కేటాయించాలని కోరారు .
గాంధీ మిషన్ కన్వీనర్ రమణరావు మాట్లాడుతూ ఆంధ్రులకోసం అమృతరావు ప్రాణాన్నే ఫణంగా పెట్టి విశాఖఉక్కును సాధించారని, కర్మాగారం ఏర్పడ్డాక ఒడుదుడుకులు ఎదుర్కొంటూ లాభాలు ఆర్జించి మేలిమి ఉక్కును ఉత్పత్తి చేసిన ఈ కర్మాగారంకు కూటమి ప్రభుత్వం చేదోడును అందించి కాపాడుకునే ప్రయత్నాలు చిత్త శుద్ధితో చేయాలని విజ్ఞప్తి చేసారు.
కార్యక్రమంలో జె అయోధ్యరాం,పివి రమణ మూర్తి, జెర్రిపోతుల మోహన్ కుమార్,శకునాల చంద్రశేఖర్, యు రామస్వామి,విల్లా రాంమోహన్ కుమార్, దేవులపల్లి సంపూర్ణం, కె పరందామయ్య, డివి రమణయ్య,పోలీస్ నాయుడు, అట్టా అప్పారావు,బూసి వెంకట్రావు, డివి రమణా రెడ్డి, డేవిడ్ రాజు,బొండా ఎల్లాజి, దాసరి సురేష్ బాబు, పులి రమణా రెడ్డి, పితాని బాస్కర్,వైకోటి, వంశీ, రవికుమార్,సూరిబాబు,రమణ తదితరులు పాల్గొన్నారు

# పేద , మధ్య తరగతి ప్రజలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ కూటమి





- జీఎస్టీ ప్రయోజనాలు విస్తృతంగా ప్రజలకు తీసుకువెళ్లాలి పార్టీ శ్రేణులకు పిలుపు

కరపత్రం విడుదల చేసిన రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు :పల్లా

**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 21**
పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజకవర్గం ఆధ్వర్యంలో జీఎస్టీ వలన పేద ప్రజలకు కలుగు ప్రయోజనాలు వివరిస్తూ వారు రూపొందించిన గోడ పత్రికను పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. గాజువాక నియోజవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంధి రెడ్డి మురళి మనోహర్. ప్రధాన కార్యదర్శి నందిక శివారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జీఎస్టీ లో పెను మార్పులు వల్ల ఈ దేశంలో ఉన్న పేద మధ్యతరగతి కుటుంబాలకు 15 వేల రూపాయల వరకు లాభం చేకూరుతుంది అన్నారు భవిష్యత్తులో దీని ఫలితాలు అద్భుతంగా ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఏ పి ఐ ఐ సి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ వాణిజ్య విభాగ ప్రతినిధులు బంక సత్యనారాయణ అజీజ్ భాష మాడిశ రమణ, ముద్రగడ శ్వేత ,సూర్యారావు, వర్మ కొరికిన చంద్రరావు గోమాడ వాసు. సింగూర్ అనంతు %జూ%టిడిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' దీపావళి ప్రత్యేక ప్రోమో

## సంక్రాంతికి వినోదాల విందుని హామీ ఇస్తున్న ప్రోమో

## త్వరలో 'అనగనగా ఒక రాజు' మొదటి గీతం విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** తనదైన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి, మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి దీపావళి ప్రత్యేక ప్రోమో విడుదలైంది. నవ్వుల టపాసులను తలపిస్తున్న ఈ ప్రోమో, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2026 సంక్రాంతికి ప్రేక్షకులకు నవ్వులతో నిండిన అసలైన పండుగకు హామీ ఇచ్చేలా ఈ ప్రోమో ఉంది.
నవీన్ యొక్క అద్భుతమైన హాస్య చతురత, అప్రయత్నమైన ఆకర్షణ ప్రతి ఫ్రేమ్ లో ప్రకాశించింది. తెరపై నవీన్ ఉత్సాహంగా కనిపించిన తీరు కట్టిపడేసింది. ఈ దీపావళి ప్రోమో వినోదాల విందులా ఉంది. నవీన్ పొలిశెట్టి శైలి హాస్యాన్ని ప్రేక్షకులు ఎందుకు అంతలా ఇష్టపడతారో ఈ ప్రోమో మరోసారి గుర్తుచేసింది. రెండు నిమిషాల ఇరవై ఎనిమిది సెకన్ల నిడివితో రూపొందిన ఈ దీపావళి ప్రోమో, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అతి కొద్దిమంది మాత్రమే నిమిషంలో ఇంతటి వినోదాన్ని పంచగలరు. అభిమానులు దీనిని "ఒక నవ్వుల అల్లరి", "వినోదాల విందు", "అసలైన పండుగ సినిమా" అని పిలుస్తున్నారు. హాస్యం, తాజాదనంతో నిండి, ప్రేక్షకులను మెప్పించే కథలను ఎంచుకోవడంలో నవీన్ మరోసారి తన నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు.ప్రేక్షకుల ఉత్సాహాన్ని మరింత పెంచుతూ.. ఈ భారీ అంచనాలున్న చిత్రం నుండి మొదటి గీతం త్వరలో విడుదల కానుంది.శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. నవీన్ పోలిశెట్టితో కలిసి ఆమె సరికొత్త వినోదాన్ని పంచనున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి, జె యువరాజ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న 'అనగనగా ఒక రాజు'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన దీపావళి ప్రోమో, ఆ అంచనాలను రెట్టింపు చేసింది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్లలో ఒకటిగా 'అనగనగ ఒక రాజు' చిత్రాన్ని నిలిపింది.సరదాల పండుగ మొదలవుతుంది. దీపావళి ప్రోమో ఆకట్టుకుంది. మొదటి గీతం రాబోతుంది. 'అనగనగా ఒక రాజు' ఈ సంక్రాంతిని గుర్తుండిపోయేలా చేయడానికి సిద్ధమవుతోంది.చిత్రం: అనగనగా ఒక రాజుతారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

# ఎమ్మెల్యేను బెదిరించి కోటి రూపాయలు

**గుంటూరు, అక్టోబరు 21, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా రోజురోజుకూ డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోతున్నాయి. సామాన్యులనే కాదు.. ప్రజాప్రతినిధులను కూడా కేటుగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా.. ఏపీలోని ఓ ఎమ్మెల్యేను బెదిరించి అతని నుంచి కేటుగాళ్లు కోటి రూపాయలు కొట్టేశారు. అసలు విషయం తెలుసుకున్న సదరు ఎమ్మెల్యే.. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకిదిగి విచారణ చేస్తున్నారు.ఏపీకి చెందిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని నివాసంలో ఉండగా.. ఈ నెల 10వ తేదీన ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారి గౌరవ్ శుక్లాగా పరిచయం చేసుకున్నాడు. ఎమ్మెల్యే బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించాడు. ఆ తరువాత కొద్దిసేపటికి మరో నెంబర్ నుంచి వీడియో కాల్ వచ్చింది. యూనిఫాంలో ఉన్న ఆ వ్యక్తి ముంబై సైబర్ క్రైమ్ బ్రాంచ్ అధికారి విక్రమ్‌గా పరిచయం చేసుకున్నాడు.ఉగ్రవాదుల బ్యాంకు లావాదేవీల కేసులో మీకు ప్రమేయం ఉంది.. మనీ లాండరింగ్ జరిగిందని పేర్కొంటూ.. ఒక ఉగ్రవాది ఖాతా నుంచి రూ.3కోట్లు మీ బ్యాంక్ ఖాతాకు బదిలీ అయ్యాయంటూ నకిలీ పత్రాలు, అరెస్టు వారెంట్లు చూపించి బెదిరించాడు. అంతేకాదు.. మీ బ్యాంక్ అకౌంట్లు పరిశీలించాలి.. అందుకు సహకరించాలి.. ఏ క్షణమైనా అరెస్టు చేస్తామంటూ భయపెట్టాడు. ఈ క్రమంలో పలు దఫాలుగా ఎమ్మెల్యే నుంచి రూ.1.07కోట్లు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు.మళ్లీ కొద్దిగంటల తరువాత మరో రూ.60లక్షలు ఇవ్వాలి అంటూ డిమాండ్ చేశాడు. దీంతో మోసపోయినట్లుగా గుర్తించిన ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్.. వెంటనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ లో జరిగిన విషయాన్ని వివరించి ఫిర్యాదు చేశారు.రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు విచారణ చేస్తున్నారు. హరియాణా, ఉత్తరప్రదేశ్ సైబర్ గ్యాంగ్ చేతివాటంగా పోలీసులు గుర్తించారు. సైబర్ కేటుగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు అనుమానితులను పోలీసులు అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

# స్టేట్స్ లో ట్వీట్స్ వార్...

**విశాఖపట్టణం, అక్టోబరు 21, పెన్ పవర్:** స్టేట్స్ అండ్ ట్వీట్స్ వార్ నడుస్తూనే ఉంది. ఏపీ, కర్ణాటక మినిస్టర్స్ మధ్య ఇన్వెస్ట్‌మెంట్స్‌పే డైలాగ్ వార్ కొనసాగుతోంది. బెంగళూరులో రోడ్లు బాలేవు..సౌకర్యాలు కల్పించడం లేదని కంపెనీల సీఈవోలు పెట్టిన పోస్టులతో వివాదం మొదలై..లోకేశ్ రెస్పాండ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ చేసిన ట్వీట్‌కు లోకేశ్ అదే స్థాయిలో రియాక్ట్ కావడం ఆసక్తికరంగా మారింది. కర్ణాటక మంత్రులు%ొ%ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. బెంగళూరులో పరిశ్రమలను రన్ చేయలేకపోతున్నామని..అక్కడి నుంచి వెళ్లిపోతామంటూ పలువురు ఇండస్ట్రియలిస్టులు స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఆ మధ్య చర్చకు దారితీసింది. ఇదే అదునుగా..ఏపీకి వచ్చేయండి..మీకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ అంటూ లోకేశ్ చేసిన ట్వీట్స్ ఆసక్తికరంగా మారాయి. బెంగళూరులో రోడ్లు, ఇతర సౌకర్యాలు, వసతులపై ఏరో స్పేస్ పార్క్, బ్లాక్ బక్ అనే పరిశ్రమ అసంతృప్తిపై గతంలోనే లోకేశ్ రియాక్ట్ అయ్యారు.ఏరో స్పేస్ పార్క్‌ను అనంతపురంకు..బ్లాక్ బక్ పరిశ్రమలను విశాఖపట్నానికి తరలించాలని కోరారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో కాక రేగింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే పరిశ్రమలు ఏపీకి తరలిపోతున్నాయని అక్కడి విపక్షాలు సిద్దరామయ్య సర్కార్‌పై అటాక్ స్టార్ట్ చేయడంతో..15 రోజుల క్రితం పెద్ద రచ్చే అయింది. అప్పటినుంచే ఏపీ, కర్ణాటక మంత్రుల మధ్య ట్వీట్ వార్ మొదలై..ఈ మధ్య కాస్త చల్లబడిందిఇప్పుడు గూగుల్ డేటా సెంటర్‌పై కర్ణాటక ఐటీ మినిస్టర్ ప్రియాంక్ ఖర్గే చేసిన కామెంట్స్ చర్చకు దారి తీస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం అడ్డగోలుగా రాయితీలు ఇచ్చి గూగుల్ డేటా సెంటర్‌ను ఏపీకి తెచ్చుకుందన్నారాయన. అన్ని రాయితీలు ఇస్తే ఏ రాష్ట్రం అయినా పెట్టుబడులు తెచ్చుకోవచ్చన్నారు. అంతేకాదు ఏపీ అప్పులు ఇప్పుడు దాదాపు రూ.10 లక్షల కోట్లకు పెరిగాయని, కేవలం ఒక సంవత్సరంలోనే రూ.లక్షా 61 వేల కోట్లకుపైగా అప్పులు తీసుకున్నారని కూడా ప్రియాంక్ ఖర్గే ట్వీట్ చేశారు.ఆంధ్రా ఫుడ్ స్పైసీగా ఉంటుందని..ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో కాస్తంత ఘాటు ఉన్నా.. దాన్ని ఆస్వాదిస్తారు. కానీ పోషకాహార నిపుణులు ఆహారంలో సమతుల్యత ఉండాలని సిఫార్సు చేస్తున్నారు. అలాగే ఆర్థికవేత్తలు కూడా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్‌ను మెయింటేన్ చేయాలని చెబుతున్నారంటూ ప్రియాంక్ ఖర్గే తన ట్వీట్‌లో చెప్పుకొచ్చారు. ఏపీ ఐటీ మంత్రి లోకేశ్..ప్రియాంక్ ఖర్గేకు కౌంటర్ ఇచ్చారు. ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడంపై పొరుగు రాష్ట్రాల్లో అలజడి మొదలైందన్నారు. ఆంధ్రా ఆహారం కారంగా ఉంటుందని అంటున్నారని, తమ పెట్టుబడులు కూడా అలాగే అనిపిస్తున్నాయని చురకలు అంటించారు. పొరుగువారికి ఇప్పటికే ఆంధ్రా కారం ఘాటు సెగ తగులుతుందని లోకేశ్ ఇచ్చి పడేశారు.ఈ ట్వీట్ వార్ లో ఏపీ ఐటీ మినిస్టర్ చుట్టూ చర్చ జరుగుతోంది. ఏపీకి ఇన్వెస్ట్‌మెంట్స్ తేవడంలో లోకేశ్ కీరోల్ ప్లే చేస్తున్నట్లుగా ఆయనకు హైప్ క్రియేట్ అవుతోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇద్దరిలో ఎవరూ కూడా కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌పై రియాక్ట్ కావడం లేదు. ప్రియాంక్ ఖర్గే అయినా..డీకే శివకుమార్ వ్యాఖ్యలు చేసినా..లోకేశే వారికి కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ ఐటీ మినిస్టర్‌గా లోకేశ్ పెట్టుబడులు తెస్తుంటే..కర్ణాటక మంత్రులు అడ్డుకుంటున్నారని..జనాల్లో చర్చ జరుగుతోంది.గూగుల్ డేటా సెంటర్ అగ్రిమెంట్ నుంచి..ఇటు ఏపీలో విపక్ష వైసీపీ విమర్శల దాక..అటు కర్ణాటక మంత్రుల ట్వీట్స్‌తో లోకేశ్ సెంట్రిక్‌గా డిస్కషన్ నడుస్తోంది. అటు ఐటీ ఫీల్డ్‌లోనూ..ఇటు ఏపీ పబ్లిక్‌లోనూ..నేషనల్ మీడియాలోనూ లోకేశ్ ట్వీట్స్‌పై డిస్కషన్ నడుస్తోంది. గూగుల్ డేటా సెంటర్ రాక సందర్భంగా ఎంతగా ప్రచారం చేసుకోవాలో అంతకంటే ఎక్కువే మైలేజ్ పొందే ప్రయత్నం చేస్తోంది కూటమి. పైగా బెంగళూరులో రోడ్లు, సౌకర్యాలు, వసతుల సరిగ్గా లేవని కంపెనీల సీఈవోలు చేస్తున్న ట్వీట్లను లోకేశ్ ప్లస్ పాయింట్‌గా మార్చుకోవడంతో..ఓవరాల్ ఎపిసోడ్‌లో ఏపీ ఐటీ మినిస్టర్ లోకేశ్ హైలెట్ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. కర్ణాటక మంత్రులు, ఏపీ మినిస్టర్ లోకేశ్ మధ్య ట్వీట్ వార్‌కు ఎండ్ కార్డ్ పడేదెప్పుడో చూడాలి.

# పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం

**విజయవాడ, అక్టోబరు 21, పెన్ పవర్:**
జనసేన అధినేత పవన్ కల్యాణ్ పదిహేనేళ్ల నినాదం వెనక చాలా వ్యూహం ఉందంటున్నారు. పవన్ కల్యాణ్ పదే పదే పదిహేనేళ్ల పాటు కూటమి కలసి ఉంటుందని చెబుతూ వస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ పెట్టే షరతులు కూడా మారతాయంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే పవన్ కల్యాణ్ గౌరవంగా వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను ఇబ్బందిపెట్టే విధంగా మాట్లాడినా మిత్రధర్మం కోసం పవన్ కల్యాణ్ సహిస్తూ కూటమి విచ్ఛిన్నం కాకపోవడానికి తానే కారణమని గట్టిగా చెప్పదలచుకున్నారు. ఇప్పటి వరకూ మిత్రపక్షాల్లో ఉన్న టీడీపీ నేతలు మాత్రమే జనసేన పై కొంత నోరు జారారుఅదేసమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం చాలా వరకూ సంయమనం పాటిస్తూ వస్తున్నారు. అందుకు దూరాలోచన కారణమన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. మొన్నటి ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించిన ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టగలిగారు. కీలకమైన పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ శాఖ వంటివాటిని ఏరికోరి తీసుకున్నారు. అంతేకాదు కొన్ని విషయాల్లో ప్రభుత్వ నిర్ణయాలను కూడా మంత్రి మండలి సమావేశాల్లో ప్రశ్నిస్తున్నారు. గతంలో అమరావతి రాజధాని రైతుల నుంచి అదనపు భూముల విషయంలో అభ్యంతరాలు తెలపడంతో పాటు ఇటీవల లూలూ సంస్థ పెట్టిన షరతులను కూడా ప్రశ్నించి తాను అవసరమైనపుడు ప్రశ్నిస్తానని సిగ్నల్స్ అధికార టీడీపీకి ఇవ్వగలిగారు.మరోవైపు 2024 ఎన్నికల వరకూ ఆయన ఎమ్మెల్యేగా కూడా ఎన్నిక కాలేదు. దీంతో అనుభవం లేకపోవడంతో సీట్ల పంపకంలో గాని, చివరకు మంత్రి పదవుల విషయంలోగాని ఒకింత రాజీ పడ్డారు. తాను తక్కువ సంఖ్యలో సీట్లు తీసుకున్నానని ఆయనకు తెలుసు. జనసైనికులకే కాదు తన అభిమానులకు కూడా అది నచ్చదని తెలిసినా చంద్రబాబు అనుభవానికి పెద్దపీట వేయాలని సహకరించారు. ఇకపై అలా ఉండదంటున్నారు. ఎందుకంటే ఉప ముఖ్యమంత్రిగా ఎటూ వచ్చే ఎన్నికల నాటికి ఐదేళ్ల అనుభవం ఉంటుంది. అందుకే వచ్చే ఎన్నికల్లో షరతులు ఉంటాయన్నది జనసైనికుల నుంచి వినిపిస్తున్నమాట. అలాగే సీట్ల విషయంలోనూ రాజీ ఉండదన్న అభిప్రాయం పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతుంది. తనకు కూటమి కలసి ఉండటం ఎంత అవసరమో టీడీపీకి అంతకంటే ఎక్కువ అవసరం కావడంతో ఈరోజు షరతులు వర్తిస్తాయని జనసైనికులు బాహాటంగానే చెబుతున్నారు.

# యాక్టివ్ అయిన కేడర్

**విజయవాడ, అక్టోబరు 21, పెన్ పవర్:**
వైసీపీ అధినేత జగన్ పార్టీకి కేవలం పదహారు నెలల్లోనూ ఆంధ్రప్రదేశ్ లో కొంత ఊపు కనిపిస్తుందని ఆ పార్టీ నేతలు అంచనా వేసుకుంటున్నారు. అందుకే ఇన్నాళ్లూ బయటకు రాని వారు కూడా ఇప్పుడు వైసీపీకి వచ్చే క్రేజ్ ను చూసి తిరిగి యాక్టివ్ అవుతున్నారు. ఇప్పటి వరకూ వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారం వస్తుందో రాదో అన్న అనుమానంతో ఇంటి గడప దాటని నేతలు కూడా నేడు బయటకు వచ్చి అధికార పార్టీ పై విమర్శలు చేస్తున్నారు. జనం నాడి కొంత తెలియడంతో వారి మనసులు కూడా మారాయంటున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన పదిహేను నెలల నుంచి కనిపించని నేతలు నేడు బయటకు రావడంతో పాటు వైసీపీ ఇచ్చిన కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నారు.అదే సమయంలో మీడియా సమావేశాలు కూడా పెట్టి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ గుడివాడ అమర్ నాథ్, పేర్ని నాని, జోగి రమేష్, ఆర్కే రోజా, విడదల రజనీ, బొత్స సత్యనారాయణ వంటి నేతలు మాత్రమే మీడియాలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి ముందుండే వారు. కానీ దూరంగా ఉండే ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు కూడా బయటకు వస్తున్నారంటే పార్టీకి కొంత హైప్ కనపడుతుందన్న భావన నేతల్లో వ్యక్తమవుతుంది. కేవలం పదహారు నెలల్లోనే వైసీపీ నేతలు ఇంత యాక్టివ్ అయితే రానున్న కాలంలో మరింతగా బయటకు వచ్చి ప్రజల్లోకి వెళతారన్న అంచనాలో కేంద్ర పార్టీ కార్యాలయం కూడా ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా జగన్ పర్యటనలకు జనం నుంచి మంచి స్పందన రావడంతో పాటు క్యాడర్ కూడా భయం లేకుండా వచ్చి పాల్గొనడంతో ఈ మార్పునకు కారణమని అంటున్నారు. అనేక అంశాలు వైసీపీకి ప్లస్ గా మారాయన్న లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధానంగా గుంటూరు మిర్చి రైతులు, పొదిలి పొగాకు రైతులు, బంగారుపాళ్యంలో చిత్తూరు మామిడి రైతుల కోసం వెళ్లిన పర్యటనతో పాటు పల్నాడు పర్యటన, తాజాగా ఉత్తరాంధ్ర పర్యటన కూడా సక్సెస్ కావడంతో ఒక్కొక్కరుగా నేతలు బయటకు వస్తున్నారు. దీంతో పాటు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశంతో పాటు కల్తీ మద్యం ఘటన కూడా తమకు అనుకూలంగా మారుతుందని అంచనా వేసుకుని మరీ నేతలు బయటకు వస్తున్నారని వైసీపీ కీలక నేత ఒకరు చెప్పారు. మొత్తం మీద రానున్న రోజుల్లో వైసీపీ నేతలు ఇక జనం బాట పట్టే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# పీడీఎస్ బియ్యం కనిపెట్టేలా మొబైల్ టెస్టింగ్ కిట్స్

**కాకినాడ, అక్టోబరు 21,పెన్ పవర్:**
పీడీఎస్ బియ్యం మాఫియా అనగానే కాకినాడ పేరు ఠక్కున గుర్తుకు వస్తుంది.. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అంతటిస్థాయి వివాదం కాకినాడ చుట్టూ ముసురుకుంది.. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ పద్దతిలో సేకరించిన పేదల బియ్యాన్ని చివరకు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలించి అక్రమ సొమ్మును ఆర్జిస్తున్నారన్న ఆరోపణలపై ఎన్నికలకు ముందు నుంచి పెద్ద దుమారమే రేగింది.. ఈనేపథ్యంలోనే ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీడీఎస్ బియ్యం మాఫియా అంతుచూస్తామని కూడా వాగ్ధానాలు చేశారు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆదిశగా చర్యలు ప్రారంభించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం హెూదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటకు వచ్చి నేరుగా పోర్టుకు వెళ్లారు.. అక్కడ అక్రమంగా ఎగుమతి అవుతున్న పీడీఎస్ బియ్యం ను టన్నుల కొద్దీ గుర్తించి సీజ్ చేయించారు.. ఆతరువాత ఏపీ సివిల్ సప్లై మినిస్టర్ నాదెండ్ల మనోహర్ కూడా మరో రెండు సార్లు కాకినాడ పోర్టులో విస్తృతంగా తనిఖీలుచేసి టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం సీజ్ చేయించారు.. కానీ చాలా వరకు అవి పీడీఎస్ బియ్యం అని నిరూపించలేని పరస్థితి తెలెత్తింది.. ఇదిలా ఉంటే కాకినాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ను అడ్డుకునేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించినప్పటికీ అవికూడా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి.. కానీ యధారాజా తథా ప్రజా అన్న చందంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అనే నియంత్రణ కాలేని పరిస్థితి కనిపిస్తోంది..గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా జరిగిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నియంత్రణ కాలేని పరిస్తితి కనిపిస్తోంది.. రేషన్ మాఫియాలో చాలా మంది పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి..ముఖ్యంగా తీర ప్రాంతాల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతుందని, దీనికి అడ్డుకట్ట



వేయాలంటే చాలా ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు సైతం చేతులెత్తేసిన పరిస్తితి కనిపించింది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి రేషన్ మాఫియాని కట్టడి చేసేందుకు మంచి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నట్లయ్యింది.. రేషన్ బియ్యం పట్టుకున్నా, అవి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం అని అనుమానాలున్నా పీడీఎస్ బియ్యం అని రూఢీ చేయడానికి టెస్ట్ చేయడానికి ల్యాబ్ కి పంపి వారం రోజులు వెయిట్ చేయాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వం ఒక మొబైల్ కిట్‌ను రూపకల్పన చేయించి పంపిణీకు సిద్ధం చేసింది. మొబైల్ కిట్ లో ఉండే కెమికల్ బాటిల్స్ రేషన్ బియ్యం లో వేసినప్పుడు పోషక విలువల కోసం రేషన్ బియ్యంలో కలుపుతున్న ఫోర్టిఫైడ్ రైస్ ఎరుపు రంగులోకి మారతాయి. వెంటనే అది అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం అని అర్ధం క్లియర్‌కట్‌గా అర్ధం అవుతుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 700 కిట్లు, 33 మంది అదనపు సిబ్బందిని విశాఖపట్నం లో 3 చెక్ పోస్ట్ ల దగ్గర నియమించారు. అలాగే కాకినాడ లో కూడా సుమారు 700 కిట్లు అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది.. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను చాలా సులభంగా గుర్తించి కట్టడి చేయడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. పీడీఎస్ బియ్యంలో పోషక విలువలు పెంచేవిధంగా ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలపడం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలను తగ్గించేందుకు ఈ ప్రక్రియను ప్రారంభించింది. వీటివల్ల ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 లాంటిముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి.. ఈ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతీ క్వింటాల్ సాధారణ బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ రైస్ కర్నల్స్ కలుపుతున్నారు. 100 కిలోల బియ్యంలో అంటే ఒక శాతం వంతు ఫోర్టిఫైడ్ బియ్యం ఉంటుంది.. ఇప్పుడు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విషయంలో పట్టించేందుకు ఈ ఫోర్టిఫైడ్ రైస్ ఉపయోగ పడుతున్నాయి..

# యానాం బీచ్ లో సంక్రాంతి సంబురాలు

**కాకినాడ, అక్టోబరు 21, పెన్ పవర్:**
సువిశాల సాగరతీరం.. తెలుపు వర్ణంలో ఆకట్టుకునే తీరంలోని ఇసుక తిన్నెలు.. కాసేపు తీరంలో గడిపితే మనసుకు, తనవుకు తాకుతూ అవధులు లేని ఉత్సాహాన్ని ఇచ్చే పిల్లతిమ్మెరలు.. అల్లంత దూరంలోనే పచ్చని తివాచీ నిలబెట్టిన చందంగా కనిపించే సరుగుడు తోటలు.. బీచ్ కు వెళ్లే ముందే రా రమ్మని ఆహ్వానం పలికే ఉప్పుటేరుల్లో బోట్ షికార్లు.. ఇక నోరూరించే ఘుమఘుమల పసందైన గోదావరి వంటకాలు.. ఇక సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింభించేలా ప్రత్యేక కార్యక్రమాలు.. జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు.. రాత్రి అయితే చాలు వినోద కార్యక్రమాలు.. ఇలా ఒక్కటేమిటి.. అన్ని హంగులతోనూ ఈ సారి సంక్రాంతి పండుగను అదిరిపోయే స్థాయిలో ప్లాన్‌చేస్తున్నారు. ఎక్కడ అనుకుంటున్నారా.. అదేనండీ ఆంధ్రా గోవా.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఉప్పలగుప్తం మండలం సూరసాన యానాం బీచ్‌లో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సంక్రాంతి పండుగ సంబరం బీచ్ ఫెస్టివల్‌గా ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు ఇంకా మూడు నెలల సమయం ఉంది. అయినా ముందస్తుగానే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సారథ్యంలో పక్కాగా మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు విడుదల చేయడంతోపాటు చమురు, సహజ వాయు సంస్థల సీఎస్సార్ నిధుల ద్వారా పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా యానాం బీచ్ లో అధికారులు పర్యటించి ప్రణాళిక సిద్ధం చేశారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు ఇక్కడికి స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో తరలివచ్చే అవకాశాలు ఉండడం వల్ల రోడ్లు అభివృద్ధి, పర్యాటకులు ఉండేందుకు రిసార్ట్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, భద్రత, రవాణా సదుపాయం ఇలా అనేక అంశాలపై పరిశీలించి ముందస్తు ఏర్పాట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యానాం బీచ్ వరకు నేరుగా భారీ వాహనాలు సైతం వెళ్లేలా పక్కా సీసీ రోడ్లు నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే క్రౌడ్ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇన్ రోడ్.. ఔట్ రోడ్డు లెక్కన రెండు విశాలమైన సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అవాంతరాలు కలుగకుండా ఈ ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటలకులకు హాస్పిటాలిటీ సదుపాయం, ఇతర సదుపాయాలతోపాటు మూడు నెలల వ్యవధిలో నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు..గతేడాది జాతీయ స్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు భారీ స్థాయిలో నిర్వహించారు. ఈ ఏడాది కూడా అంతకంటే భారీ స్థాయిలో సంక్రాంతి పండుగకు ముందే నిర్వహించాలని ఆలోచనలో ఉన్నామంటున్నారు. దీనికి తోడు పగటి పూట బోట్ షికార్, బీచ్ సాండ్ వెహికల్స్, స్కై డ్రైవింగ్, బెలూన్ డైవింగ్ ఇలా పలు అడ్వెంచర్ ఈవెంట్స్ నిర్వహించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి 3 రోజులు కూడా యానాం బీచ్‌లోనే భారీ ఎత్తులో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. దీనికోసం ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు దిశగా కృషిచేస్తున్నామన్నారు. భారీ భోగి మంటల నుంచి రంగవల్లుల అలంకరణ తదితర సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింభించేలా పండుగ నిర్వహిస్తామని, ఈ ఏడాది బీచ్ ఫెస్టివల్ తరలి

వచ్చేందుకు వసతి, సదుపాయాల కల్పనకు ముందస్తుగానే ఆంధ్రాగోవా బీచ్ ఫెస్టివల్ అనే వెబ్ సైట్ ద్వారా స్లాట్లు తెరుస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నుంచి ఎస్.యానాం బీచ్‌కు చేరుకోవాలంటే 34 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అమలాపురం నుంచి బీచ్ వరకు పక్కా రోడ్లు సదుపాయాలున్నాయి. బస్సు సదుపాయం కూడా ఉంది. ఇక రాజమండ్రి నుంచి వచ్చేవారు రాజమండ్రి రైల్వే స్టేషన్ నుంచి అమలాపురం వచ్చి అమలాపురం నుంచి ఎస్.యానాం చేరుకోవచ్చు. కాకినాడ నుంచి అమలాపురం వచ్చి అక్కడి నుంచి ఎస్.యానాం బీచ్‌కు సునాయాసంగా చేరుకోవచ్చు.

# ఆస్ట్రేలియాపై ఎంపిక కాకున్నా 2027 వన్డే వరల్డ్ కప్‌లో అతడు ఉండాల్సిందే: రవిశాస్త్రి





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్ కు టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాకు చోటు దక్కని సంగతి తెలిసిందే. మూడు వన్డేల సిరీస్ లో భాగంగా అక్టోబర్ 4న అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ప్రకటించింది. 15 మందితో కూడిన స్క్వాడ్ లో జడేజాను తప్పించడం ఆశ్చర్యానికి గురి చేసింది. మొదట జడేజాకు రెస్ట్ అనుకున్నప్పటికీ ఆ తర్వాత ఈ సీనియర్ ఆల్ రౌండర్ ని తప్పించామని అగార్కర్ చెప్పాడు. దీంతో జడేజా వన్డే ఫార్మాట్ ఆడడంపై అనుమానాలు నెలకొన్నాయి. 2027 వన్డే వరల్డ్ కప్ లోనూ జడేజా ఆడతాడా లేదా అనే డౌట్స్ కూడా ఉన్నాయి. 2027 వన్డే వరల్డ్ కప్ సమయానికి ఆల్ రౌండర్ జడేజా ఖచ్చితంగా భారత జట్టులో ఉండాలని టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తెలిపాడు. జడేజా జట్టులో ఎందుకు ఉండాలో కూడా వివరణ ఇచ్చాడు. రవిశాస్త్రి మాట్లాడుతూ.. "అందరూ 2027 వన్డే వరల్డ్ కప్ గురించి మాట్లాడుకుంటున్నారు. అతని వన్డే కెరీర్ ముగిసిందని ఎవరూ అనుకోవద్దు. 2027 వన్డే వరల్డ్ కప్ ప్రణాళికల్లో అతడు ఉంటాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. జడేజా ఫీల్డింగ్ చూస్తుంటే అతను 7-8 సంవత్సరాలు చిన్నగా ఉన్నాడేమో అనిపిస్తుంది. గ్రౌండ్ లో అతను బంతిని ఛేజ్ చేస్తూ ఆపడం చాలా గొప్పగా ఉంటుంది. ప్రస్తుతం భారత జట్టులో అక్షర్ పటేల్ ఉన్నాడు.

ఆస్ట్రేలియా లాంటి పర్యటనలో జడేజాకు ఎందుకు ఛాన్స్ ఇవ్వలేదో నేను అర్థం చేసుకోగలను. ఆస్ట్రేలియాపై కేవలం మూడు వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. ఒక స్పిన్నర్ సరిపోతాడు. కానీ 2027 వన్డే వరల్డ్ కప్ సౌతాఫ్రికాలో జరుగుతుంది.అక్కడ వేరు వేరు వేదికలపై వేరు వేరు జట్లతో ఆడాల్సి ఉంటుంది. నాకు తెలిసి ఇద్దరు స్పిన్నర్లు జడేజా, అక్షర్ ఆడతారనుకుంటున్నా". అని శాస్త్రి తెలిపాడు. ఆస్ట్రేలియా గడ్డపైనా జడేజా లాంటి అనుభవజ్ఞుడి అవసరం ఎంతైనా ఉంది. జడేజాను కాదని సుందర్, అక్షర్ కు ఛాన్స్ దక్కింది. చూస్తుంటే జడేజాను సైలెంట్ గా పక్కకు తప్పించి యంగ్ ప్లేయర్స్ సుందర్, అక్షర్ లకు వరల్డ్ కప్ సమయానికి ఎక్కువ ఛాన్స్ లు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.నుభవజ్ఞుడైన జడేజా 204 మ్యాచ్‌ల్లో 231 వికెట్లు పడగొట్టాడు. 2,806 పరుగులు చేసి బ్యాట్ తోనూ సత్తా చాటాడు. 2024 టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలిచిన తర్వాత జడేజా అంతర్జాతీయ టీ20 క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం వన్డే, టెస్ట్ క్రికెట్ లో కొనసాగుతున్నాడు. వన్డేల్లో ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలోనూ రాణించాడు. స్పిన్ ఆల్ రౌండర్ గా వన్డే జట్టులో రెగ్యులర్ ప్లేయర్ అనుకుంటే సెలక్టర్లు జడేజాకు ఊహించని షాక్ ఇచ్చారు.


# అది అత్యంత చెత్త నిర్ణయం.. రాహుల్‌ను నాలుగో స్థానంలో ఆడించండి: టీమిండియా మాజీ బ్యాటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఘోరంగా ఓడిపోయిన తర్వాత తీవ్ర విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. ఎంతో అనుభవం కలిగిన టీమిండియా బ్యాటింగ్ లైనప్ ఆసీస్ బౌలర్లకు తలవంచింది. కనీసం పోరాడకుండానే చేతులెత్తేసింది. ఈ మ్యాచ్ ఓటమి సంగతి పక్కన పెడితే ఒక విషయంలో తీవ్ర చర్చ జరుగుతుంది. అదేంటో కాదు టీమిండియా వికెట్ కీపర్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్. ఐదో స్థానంలో ఎంతో అద్భుతమైన రికార్డ్ ఉన్న రాహుల్ పెర్త్ వేదికగా ఆసీస్ తో జరిగిన తొలి వన్డేలో ఆరో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చాడు. ఎంతో అనుభవమున్న రాహుల్.. అక్షర్ పటేల్ కంటే వెనుక బ్యాటింగ్ కు రావడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ కు పంపడంపై టీమిండియా మాజీ బ్యాటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఫైరయ్యాడు. రాహుల్ ను నాలుగో స్థానంలో బ్యాటింగ్ కు పంపాలని కోరాడు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. " మొదట వన్డేకు ముందు నేను రాహుల్ ను నాలుగో స్థానంలో బ్యాటింగ్ కు పంపాలని కోరాను. రాహుల్ ను నాలుగోస్ తాణంలో ఆడింది శ్రేయాస్ అయ్యర్ ను ఐదో స్థానంలో పంపించండి. జట్టు కూర్పు నాకు భయంకరంగా అనిపించింది. అక్షర్ పటేల్‌ను రాహుల్ కంటే ముందుగా ఎందుకు పంపుతారు?. 2019 ప్రపంచ కప్‌లో, రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. నాలుగు, ఐదు స్థానాల్లో అతనికి అద్భుతమైన రికార్డ్ ఉంది. రాహుల్ కంటే ముందు అక్షర్ పటేల్‌ను ప్రమోట్ చేయడం చాలా దారుణం". అని శ్రీకాంత్ అన్నాడు. వన్డేల్లో రాహుల్ కు ఐదో స్థానంలో సూపర్ రికార్డ్ ఉంది.50 ఓవర్ల ఫార్మాట్ లో ఐదో స్థానంలో 50కి పైగా యావరేజ్ ఉంది. అయితే ఏడాది కాలంగా శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్ నుండి అతను ఒక స్థానం దిగజారి ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలో ఆరో స్థానంలో కూడా రాహుల్ అదరగొడుతున్నాడు. ఒత్తిడి సమయంలో కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు విజయాలను అందిస్తున్నాడు. ఇటీవలే సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై అజేయంగా 42 పరుగులు చేసి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

# వన్డే క్రికెట్ చరిత్రలో తొలిసారి.. బంగ్లాదేశ్‌పై వెస్టిండీస్ నయా వరల్డ్ రికార్డ్

**హైదరాబాద్ పెన్ పవర్:** వన్డే క్రికెట్ లో వెస్టిండీస్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. ఫామ్ లో లేని వెస్టిండీస్ జట్టు వరల్డ్ రికార్డ్ అంటే ఆశ్చర్యపోవడం గ్యారంటీ. వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మంగళవారం (అక్టోబర్ 21) రెండో వన్డే ప్రారంభమైంది. ఢాకా వేదికగా షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో బంగ్లాదేశ్ మొదట బ్యాటింగ్ చేసింది. ఈ మ్యాచ్ లో ఆశ్చర్యకరంగా వెస్టిండీస్ స్పిన్నర్ తో వేయించింది. అయితే విశేషం ఏమిటంటే 50 ఓవర్లు వెస్టిండీస్ స్పిన్నర్ల చేత బౌలింగ్ వేయించడం షాకింగ్ గా మారింది. పిచ్ స్పిన్ కు అనుకూలించడంతో విండీస్ జట్టు ఏకంగా 50 ఓవర్లు స్పిన్ కే ఇవ్వడం విశేషం. వెస్టిండీస్ ప్లేయింగ్ 11లో ఒక్క స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్ కూడా లేకపోవకడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆల్ రౌండర్లు రూథర్ ఫోర్డ్, గ్రేవీస్ మీడియం పేస్ వేయగలిగిన వీరికి ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ ఇవ్వలేదు. పిచ్ మీద చాలా పగుళ్లు ఉండడంతో కెప్టెన్ షాయ్ హోప్ ఐదుగురు స్పిన్నర్లను ఉపయోగించాడు. అకేల్ హొసిన్, రోస్టన్ చేజ్,



| Bowler | O | M | R | W | NB | WD | ECO |
|---|---|---|---|---|---|---|---|
| Akeal Hosein | 10 | 1 | 41 | 2 | 1 | 2 | 4.10 |
| Roston Chase | 10 | 2 | 44 | 0 | 0 | 0 | 4.40 |
| Khary Pierre | 10 | 0 | 43 | 0 | 0 | 0 | 4.30 |
| Motie | 10 | 0 | 65 | 3 | 0 | 0 | 6.50 |
| Alick Athanaze | 10 | 3 | 14 | 2 | 1 | 0 | 1.40 |




అలిక్ అథనాజ్, గుడాకేష్ మోతీ, ఖారీ పియరీ తలో 10 ఓవర్లు వేసి తమ స్పెల్ పూర్తి చేశారు. పిచ్ స్పిన్నర్లకు అనుకూలించడంతో విండీస్ మొత్తం 50 ఓవర్లను స్పిన్నర్లకే అప్పగించింది. పార్ట్ టైం స్పిన్నర్ అలిక్ అథనాజ్ కూడా 10 ఓవర్ల స్పెల్ వేశాడు.

వన్డే క్రికెట్ చరిత్రలో అసోసియేట్ జట్టు కాకుండా పూర్తి సభ్యత్వ జట్టుగా 50 ఓవర్లు స్పిన్ బౌలింగ్ వేసిన తొలి జట్టుగా విండీస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పింది. అంతకముందు ఈ రికార్డ్ శ్రీలంక పేరిట ఉంది. వన్డేల్లో శ్రీలంక మూడు వేరు వేరు మ్యాచ్ ల్లో 44 ఓవర్ల పాటు బౌలింగ్ చేయడం ఇప్పటివరకు అత్యధికం. 1996లో వెస్టిండీస్ పై.. 1998లో న్యూజిలాండ్ పై.. 2004 లో ఆస్ట్రేలియాపై జరిగిన వన్డే మ్యాచ్ లో శ్రీలంక 44 ఓవర్ల పాటు స్పిన్ బౌలింగ్ వేసింది. తాజాగా బంగ్లాదేశ్ పై వెస్టిండీస్ ఈ రికార్డ్ బ్రేక్ చేసింది.ఈ మ్యాచ్ లో బంగ్లాదేశ్ కూడా తమ తొలి 7 ఓవర్లు స్పిన్నర్లు వేయడం గమనార్హం. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. పిచ్ స్పిన్ కు అనుకూలించడంతో విండీస్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఆతిథ్య బంగ్లా జట్టును కట్టడి చేశారు. 45 పరుగులు చేసిన సౌమ్య సర్కార్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ 32 పరుగులు చేసి రాణించగా.. చివర్లో రిషద్ హుస్సేన్ 14 బంతుల్లోనే 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 39 పరుగులు చేసి చివర్లో జట్టును 200 స్కోర్ దాటించాడు. వెస్టిండీస్ బౌలర్లలో గుడాకేష్ మోతీ మూడు వికెట్లు పడగొట్టాడు. అకేల్ హొసిన్, అలిక్ అథనాజ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. తొలి వన్డేలో బంగ్లాదేశ్ గెలిచి 1-0 ఆధిక్యంలో ఉంది.

## శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు



# అఖండ2.. బాలయ్య ఫ్యాన్స్ కు పూనకాలు ఖాయం!



సీనియర్ హీరో బాలకృష్ణ వరుస హిట్లతో ఫుల్ జోష్ మీదున్నారు. తన లక్కీ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో వస్తోన్న అఖండ2 సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారు బాలయ్య. 2021లో రిలీజైన అఖండ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఉత్సాహంగా వెయిట్ చేస్తున్నారు. అఖండ సినిమాతో బాలయ్య మాస్ ఇమేజ్ కు కొత్త డైమెన్షన్ ను ఇచ్చిన బోయపాటి అఖండ2ను మరింత ఆధ్యాత్మిక, యాక్షన్ ఫ్రేమ్ లో తెరకెక్కిస్తున్నారు.

**అఖండ2 కోసం ఎదురుచూపులు**

ఈ నేపథ్యంలో అఖండ2 గురించి ఇప్పటికే చాలా విషయాలు బయటికొచ్చి అవన్నీ ఫ్యాన్స్, సదరు మూవీ లవర్స్ ను ఎంతగానో ఎగ్జైట్ చేస్తుండగా ఈ సినిమా గురించి ఇప్పుడు మరో వార్త సోషల్ మీడియాలో వినిపిస్తోంది. అఖండతో పోలిస్తే అఖండ2 లో బోయపాటి యాక్షన్ సీక్వెన్స్ ను మరింత భారీగా ప్లాన్ చేశారని మొదటి నుంచి చెప్తూనే వస్తున్నారు.

**25 నిమిషాల యాక్షన్ సీక్వెన్స్**

అందులో భాగంగానే అఖండ2లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ 25 నిమిషాలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. అయితే అఖండ2లోని ఆ యాక్షన్ సీక్వెన్స్ ను చూసిన తర్వాత ప్ర ముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఆ యాక్షన్ ఎపిసోడ్ ను 20 నిమిషాల్లోపు ఉండేలా తగ్గించమని రిక్వెస్ట్ చేశారని సమాచారం. ఈ వార్తల్లో నిజమెంతన్నది పక్కన పెడితే ఒకవేళ నిజమైతే మాత్రం బాలయ్య ఫ్యాన్స్ కు పూనకాలు రావడం ఖాయమనే చెప్పాలి.

**నార్త్ మార్కెట్ ను టార్గెట్ చేసిన అఖండ2**

మామూలుగానే బాలయ్య-బోయపాటి సినిమాల్లో ఎక్కువ యాక్షన్ ఉంటుంది. ఇప్పుడు అఖండ2లో బోయపాటి కావాలని నార్త్ ఆడియన్స్ కోసం ఆ యాక్షన్ సీక్వెన్స్ ను మరింత పెంచినట్టు చెప్తున్నారు కాబట్టి, ఇక ఇది ఏ రేంజ్ లో ఉంటుందో ఊహించుకోవడం కూడా కష్టమే. అఖండ2లో బాలయ్య యాక్షన్, పెర్ఫార్మెన్స్ నెక్ట్స్ లెవెల్ ఉండటం ఖాయమని అర్థమవుతుంది. ప్రగ్యా జైస్వాల్, సంయుక్త మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ గా నటిస్తుండగా, 14 రీల్స్ ప్లస్ బ్యానర్ లో రామ్ ఆచంట, గోపీ ఆచంట అఖండ2 ను భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5న అఖండ2 ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ సారి మేకర్స్ నార్త్ మార్కెట్ పై ఎక్కువ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

## కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com